

నార్సింగి గ్రామంలో జరిగిన పశు సంక్రాంతిలో వ్యాపారులు, రైతులను ఆకట్టుకుంటున్న ధూళియా జాతి గేదెల దృశ్యం



హైదరాబాద్ వార్త

# నగరాన్ని వెంటాడుతున్న అగ్నిప్రమాదాలు

## -గుడిమల్కాపూర్, మాదాపూర్, నిజాంపేట్‌లో ఎగిసిపడ్డ అగ్నికీలలు



నిజాంపేట్‌లో టిఫిన్ సెంటర్ పూర్తిగా దగ్ధమైన షాపులు



కొత్తగూడ అగ్నిప్రమాదంలో దగ్ధమైన కార్లు

**హైదరాబాద్, జనవరి 24 ప్రభాతవార్త**

అగ్నిప్రమాదాలు హైదరాబాద్ నగరాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు నగరంలో మూడు చోట్ల అగ్నిప్రమాదాలు సంభవించాయి. నిన్న రాత్రి మాదాపూర్‌లో, శుక్రవారం ఉదయం నిజాంపేట్‌లో, మధ్యాహ్నం గుడిమల్కాపూర్‌లో అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిమల్కాపూర్‌లోని ఓ కట్టెల గోదాంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 111 వద్ద ఈ ప్రమాదం జరిగింది. కట్టెల గోదాంకు ఓ వైపున మెకానిక్ షెడ్, మరో వైపున విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. అయితే మెకానిక్ షెడ్‌కు మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. ఇక మెకానిక్ షెడ్‌లో ఉన్న గ్యాస్ సిలిండర్లను కూడా స్థానికులు బయటకు తీసుకొచ్చారు. సిలిండర్లకు కానీ, ఇటు విద్యుత్ సబ్ స్టేషన్‌కు కానీ మంటలు అంటుకుని ఉంటే భారీ ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

**మాదాపూర్‌లో..**

ఐటి కారిడార్ పరిధిలోని కొత్తగూడలో గురువారం రాత్రి చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో భారీగా ఆస్థినష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో కార్ల షోరూమ్‌లో ఉన్న 14 కొత్త కార్లు, 30 లక్షల నగదు అగ్నికి ఆహుతయ్యాయి. గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా శ్రమించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది శుక్రవారం ఉదయానికి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం చోటుచేసుకుకపోవడంతో ఆంతా ఊపిరిపీల్చుకోగా, కోట్లలో ఆస్థినష్టం సంభవించింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కొత్తగూడలోని వివిసి మోటార్స్ మహీంద్రా కార్ల షోరూమ్‌లో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో షోరూమ్‌లో మంటలు ఒక్కసారిగా చెలరేగి షోరూమ్ మొత్తం వ్యాపించాయి. దీంతో మాదాపూర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది నాలుగు ఫైరింజన్లతో వచ్చి మంటలను ఆర్పివేశారు. మంటలు షోరూమ్ మొత్తం విస్తరించడంతో అదుపు చేయడం కష్టతరంగా మారగా, అత్యాధునిక బ్రోంటో స్కైలిఫ్ట్ యంత్రాన్ని సైతం రంగంలోకి దించి సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్లతో పాటు వాటర్ ట్యాంకర్లను తెప్పించి శుక్రవారం ఉదయం వరకు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో షోరూమ్‌లో ఉన్న మొత్తం 14 కొత్త కార్లు కాలిపోయాయి. షోరూమ్‌లో డిస్‌ప్లే కోసం ఉంచిన 5 థార్ కార్లు, 4 ఎక్స్‌యువి 700, 3 ఈవి కార్లు, ఓ త్రీఎక్స్ డెమో కారు మంటల్లో కాలి బూడిదయ్యాయి. వీటితో పాటు షోరూమ్ క్యాష్ కౌంటర్‌లో ఉంచిన దాదాపు 30 లక్షల రూపాయలు మంటల్లో కాలిపోయినట్లు నిర్వాహకులు తెలిపారు. షోరూమ్ లాకర్‌లో ఉంచిన మరికొంత నగదును క్షేమంగా బయటకు తీశారు. కాగా షోరూమ్ లోపలి భాగంలో మంటలు ప్రారంభం కావడంతోనే మంటలను అదుపు చేయడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలుస్తుంది. దీని కారణంగానే షోరూమ్ మొత్తం మంటలు వ్యాపించాయని, ప్రమాదంలో కోట్ల రూపాయల ఆస్థినష్టం సంభవించిందని అగ్నిమాపక అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**నిజాంపేట్‌లో..**

శుక్రవారం తెల్లవారుజామున నిజాంపేట్‌లో హెచ్పీ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న ఫిట్నెస్ సెంటర్స్‌కి ఆనుకొని ఉన్న టిఫిన్ సెంటర్లో గ్యాస్ వెలిగించే క్రమంలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో మూడు గ్యాస్ సిలిండర్లు పేలి పక్కన ఉన్న ఫిట్నెస్ సెంటర్ పైకి, పెట్రోల్ బంక్ ఆనుకొని ఒక సిలిండర్ పడడంతో ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే బాచుపల్లి పోలీసులకి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనలో మంటలు పక్కన ఉన్న షాప్స్‌కి కూడా సోకడంతో పక్కన షాప్స్ కూడా పూర్తిగా ధ్వంసం అవడంతోపాటు షాప్స్ లోపల ఉన్న సామాను మొత్తం పూర్తిగా ధ్వంసం అవ్వడంతో షాప్ యజమానులు కన్నీరు మున్నీరు అయ్యారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని చుట్టుపక్కల వాళ్ళు తెలిపారు.

# అనుమతి లేని ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి

-రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన 28 ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చి రద్దు చేయాలి

- జిల్లా వైద్యాధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతన్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తదితరులు

**హైదరాబాద్, జనవరి 24,ప్రభాతవార్త:**

జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు క్లినిక్‌లు, వెల్నెస్ సెంటర్లు, ఫిజియోథెరపీ సెంటర్లు, డెంటల్ క్లినిక్ లు, ఎక్స్‌రే క్లినిక్, అలోపతి, ఆయుష్ క్లినిక్ లు తప్పనిసరిగా, విధిగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ ఆక్ట్ సమావేశములో చైర్మన్ హోదాలో అయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేట్ క్లినిక్‌లు, ల్యాబ్ లు, హాస్పిటల్స్ , వెల్నెస్ సెంటర్లు, ఫిజియోథెరఫీ సెంటర్లు, కంటి ఆసుపత్రులు అలాగే ఆయుర్వేద, యునాని, హోమియో, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి అన్ని హాస్పిటల్స్ , క్లినిక్కులు కూడా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేనిచో అటువంటి వాటిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులకు మొదటి విడతగా 50 వేల రూపాయలు ఫైన్ విధించి చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి ప్రైవేట్ ఆస్పత్రి లను సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు తమ పరిధిలోప్రత్యేక సర్వే క్షేత్రస్థాయిలో నిర్వహించి అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ పొందుటకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగేఅన్ని ప్రైవేట్ ఆస్పత్రులు పేషంట్ల వివరములు, అందించిన వ్యాధుల చికిత్స, అందిస్తున్న అన్ని సేవలు, డాక్టర్లు,నర్సులు, మరియు పారామెడికల్ సిబ్బంది యొక్క వివరాలు హెచ్ఎమ్ఐఎస్ పోర్టల్ లో ప్రతినెల నమోదు చేయాలన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ గడువు అయిపోయిన 28 ప్రైవేట్ ఆస్పత్రులకు షో కాజ్ నోటీసులు ఇచ్చి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. ,ప్రైవేట్ ఆస్పత్రులలో అర్హత కలిగిన డాక్టర్లు మాత్రమే విధులు నిర్వహించాలని నిబంధనలు ఉల్లంఘించిన వెంటనే ఆసుపత్రి అనుమతి రద్దు చేయబడునని తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ క్యాలెండర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కదిరివన్, అడిషనల్ డీసీపీ డాక్టర్ మనోహర్‌జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్. జె వెంకట్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీరంగ్ అబ్కారి , జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, సీనియర్ పబ్లిక్ హెల్త్ అధికారులు, డిప్యూటీ డెమో అంజయ్య, నర్సింహా ,న్యూస్ మీడియా అధికారి రాములు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ కరెన్సీ తయారు చేస్తున్న వ్యక్తి అరెస్టు



విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను తెలుపుతున్న దృశ్యం

**నేరేడ్‌మెట్, జనవరి 24 ప్రభాతవార్త :**

నకిలీ కరెన్సీని తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ పోలీసులు కమిషనర్ సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఆత్మకూరు మండల్ అమరచింత గ్రామానికి చెందిన కర్లీ నవీన్ కుమార్ (26) బీటెక్ విద్యను అభ్యసించాడు. అనంతరం డిప్లమా ఇన్ మల్టీమీడియాలో శిక్షణ తీసుకోవడం జరిగిందన్నారు. 2003 సంవత్సరంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న సమయంలో నకిలీ కరెన్సీ తయారు చేయాలని ఆలోచించినట్లు తెలిపారు. ఈ క్రమంలో నకిలీ నోట్లు తయారు చేయాలని నిర్ణయించుకున్న నవీన్ కలకత్తా కు చెందిన ఓ వ్యక్తితో 45 జీఎస్ఎం పేపర్‌లను కొనుగోలు చేశాడు. అనంతరం అతని స్నేహితుడు సహాయంతో ఆంధ్ర ప్రదేశ్ లోని కర్నూల్ లో పరికరాలను సమర్చుకొని 500 రూపాయల నకిలీ నోట్లను తయారుచేసి వాటిని మార్కెట్లో నిజమైన నోట్లుగా మార్చడం ప్రారంభించాడు. అనంతరం కలకత్తా, గుజరాత్ విజయవాడ ఇతర ప్రాంతాలకు సరఫరా చేసాడన్నారు. డిసెంబర్ 2004న గుజరాత్ కు చెందిన వ్యక్తి నవీన్ తో 25 లక్షల (50 రూపాయల నోట్లు) నకిలీ నోట్లను తయారు చేయాలని రూపాయలు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో నకిలీ నోట్లు తయారుచేస్తున్న స్థలానికి సైతం ఆ వ్యక్తి రావడం జరిగిందన్నారు. ఈనెల 23వ తేదీన విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ పోలీసులు పహాడీ షరీఫ్ పోలీసుల సహాయంతో తుక్కుగూడ సమీపంలో నవీన్ ని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం నవీన్ వద్ద నుంచి ఐదు లక్షల రూపాయల నకిలీ నోట్ల తో పాటు ఒక ల్యాప్ టాప్, ప్రింటర్ ఇతర పరికరాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎస్ఓటి మురళీధర్, ఎల్బీనగర్ , ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కంటైనర్‌తో వెళ్తున్న లారీ బోల్తా

## -లక్డీకాపూల్‌లో భారీగా ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్, జనవరి 24 ప్రభాతవార్త**

కంటైనర్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే..మూసాపేట్ నుంచి కాటేదాన్ వెళ్తున్న లారీ లక్డికాపూల్ టర్నింగ్ వద్దకు రాగానే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో రోడ్డుపై రద్దీ లేకపోవడంతో వాహనదారులకు పెను ప్రమాదం తప్పింది. కంటైనైర్ బోల్తా పడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలను మరో రూట్లో మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సాహిత్యాన్ని సన్నిహితం చేసే లిటరరీ ఫెస్టివల్

## -ఐటి కారిడార్‌లో ఆకట్టుకుంటున్న వేడుకలు

**సైబరాబాద్ ప్రతినిధి, జనవరి 24 ప్రభాతవార్త**

ఐటి ఉద్యోగులు, యువతకు హైదరాబాద్ సాహిత్యాన్ని దగ్గర చేసేందుకు ఐటి కారిడార్ పరిధిలో ఏర్పాటు చేసిన సాహిత్య ఉత్సవాలు ఆకట్టుకుంటున్నాయి. సాహితీ ప్రియులను ఆకట్టుకునే విధంగా ఐటి కారిడార్ పరిధిలోని సత్వా నాలెడ్జ్ సిటీలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాలను హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రదర్శనను శుక్రవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన పుస్తకాలను, చిత్రప్రదర్శనను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పరిశీలించారు. పుస్తకాలు, రచయితలను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి పాఠకులకు దగ్గర చేసే విధంగా ఈ సాహిత్య ఉత్సవాలను కొనసాగిస్తున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకొని పలు పుస్తకాలను ఆవిష్కరించడంతో పాటు అంతరించిపోతున్న బాషలను రక్షించే విధంగా పుస్తకాలను అందుబాటులో ఉంచారు. పర్యావరణ పరిరక్షణ, శాస్త్ర, సాంకేతిక రంగంపై సామాన్యులకు సైతం అర్థం అయ్యే విధంగా రూపొందించిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. గత 14 సంవత్సరాలుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఐటి కారిడార్ ప్రాంత వాసులకు సాహిత్య ఉత్సవాలను దగ్గర చేసేందుకు ఈ సంవత్సరం మాదాపూర్‌లోని సత్వా నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన పుస్తక ప్రేమికులను ఎంతో ఆకట్టుకుంటుంది. అంతరించిపోతున్న బాషలు, పర్యావరణంలో రోజురోజుకు చోటుచేసుకుంటున్న మార్పులు, శాస్త్ర సాంకేతిక రంగాలపై పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నేటి యువతకు శాస్త్ర సాంకేతిక రంగాన్ని అర్థం అయ్యే విధంగా ఈ ఉత్సవాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. సాధారణ పుస్తక ప్రదర్శన మాదిరి కాకుండా సదరు పుస్తకాల్లో ఉండే అంశాలను పరిచయం చేసే కార్యక్రమాలు ఇక్కడ ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి. అన్ని రంగాల్లోని విషయాల ఆధారంగా రూపొందించిన పుస్తకాలను ఇక్కడ అందుబాటులో ఉంచారు. పర్యావరణ ప్రేమికులకు వృక్ష శాస్త్రంపై రూపొందించిన పుస్తకాలు, సాహితీ ప్రియులకు సాహిత్య పుస్తకాలు ఆకర్షిస్తున్నాయి. ఈ సంవత్సరం అంతరించిపోతున్న బాషలు, వాతావరణ మార్పులు, రోజువారి జీవితంలో శాస్త్ర సాంకేతిక పాత్రపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని నిర్వాహకులు తెలిపారు.



హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

# మేయర్‌పై అవిశ్వాసం దిశగా బిఆర్ఎస్ అడుగులు..!

-మద్దతుకోసం ఎంఐఎం..బిజెపి నేతలతో చర్చలు

-తీర్మానం నెగ్గేందుకు రహస్య మంతనాలు

-మేయర్ తీరుపై గుర్రుగా ఉన్న పలువురు ప్రతిపక్ష కార్పొరేటర్లు





**హైదరాబాద్, జనవరి 24,ప్రభాతవార్త:**

జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఏకమవుతున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికార బలంతో ప్రతిపక్ష నేతలను ఏమాత్రం ఖాతరు చేయడంలేదన్న ప్రధాన కారణంతో మేయర్‌ను గద్దె దింపేందుకు బద్ధవిరోదులైన ఎంఐఎం,బిజెపికి చెందిన పలువురు కార్పొరేటర్లు సైతం బిఆర్ఎస్‌తో రహస్య మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. రెండురోజుల క్రితం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు మేయర్‌పై అవిశ్వాస తీర్మానంపై తీవ్ర చర్చకు దారితీస్తుంది. మేయర్ తీరుపై అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్పోరేటర్లు కూడా ఆమెకు వ్యతిరేకంగా ఓటింగ్ చేసే అవకాశాలున్నట్టు తెలుస్తుంది. అలాగే బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసం పెడితే తాము భేషరతుగా అవిశ్వాసానికి మద్దతిస్తామంటూ బీజెపి కార్పోరేటర్లు ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటి కాదని ప్రజలకు చెప్పదలుచుకుంటే మేయర్‌పై అవిశ్వాస తీర్మాణం పెట్టితీరాలని బీజేపికు చెందిన ఒకార్పొరేటర్ జిహెచ్ఎంసి ప్రధాన కార్యలయంలో మీడియా ప్రతినిధుల సాక్షిగా డిమాండ్ చేశారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని తాము పలుమార్లు ప్రజలకు వివరిస్తూ వస్తున్నామని.. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసి పనిచేస్తున్నాయాలేదా అనేదానికి మేయర్ అవిశ్వాస తీర్మాణంతో తేటతెల్లమవుతుందన్నారు. కాగా ఈపరిణామాలన్నీ గ్రహించి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శుక్రవారం సింగపూర్, దావోస్ పర్యటనలు ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డిని తనతండ్రి ప్రభుత్వ సలహాదారు కేశవరావుతో కలిసి జరుగుతున్న పరిణామాలపై చర్చించినట్లు తెలుస్తుంది. నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే మొత్తం కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుల్లో సగం మంది నిర్ణీత ప్రొఫార్మాలో తీర్మానం చేసి సంతకాలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలి. ఆతర్వాత 15 రోజుల్లో సంతకాలు పెట్టిన ప్రజాప్రతినిధులు..మిగతా సభ్యులతో కలిసి మీటింగ్ ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహిస్తారు. అందులో 98మంది సభ్యులు అశిశ్వాసానికి అనుకూలంగా ఉంటే అవిశ్వాసం నెగ్గినట్లు..అందులో ఒక్కరు తక్కువైనా అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటిస్తారు. అయితే జీహెచ్ఎంసీలో ప్రస్తుతం 146 మంది కార్పొరేటర్లు, 50 మంది ఎక్స్‌అఫిసియో సభ్యులు మొత్తం 196 మంది ఉన్నారు. వీరిలో సగం అంటే 98 మంది సభ్యుల సంతకాలు అవసరం. అయితే బీఆర్ఎస్‌కు ప్రస్తుతం 42 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు కలిపి 71 మంది సభ్యుల బలం ఉంది. అవిశ్వాసం పెట్టాలంటే మరో 27 మంది సభ్యులు అవసరం. దీంతో ఎంఐఎం, బీజేపీతో కలిస్తేనే అవిశ్వాసం పెట్టేందుకు వీలవుతుంది.

# హైదరాబాద్ అభివృద్ధిలో మెట్రోరైల్ కీలకం

## -మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

**బేగంపేట జనవరి 24, ప్రభాతవార్త**



హైదరాబాద్ ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీ పడాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పానికి అనుగుణంగా హైదరాబాద్ లో మెట్రో రైల్ వ్యవస్థను నలుదిక్కులా విస్తరిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. 69 కిలోమీటర్లు అడుగుతో ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో ని దాదాపు 200 కిలోమీటర్లకు పైగా విస్తరించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈవీ జిప్ సంస్థ హైదరాబాద్ లో మొదటి చివరి మైల్ కనెక్టివిటీ లో భాగంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, క్యాబ్‌లను ఎల్ అండ్ టి ఎండీ కేవీబీ రెడ్డితో కల్సి ఎన్వీఎస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఈవీ జిప్ తో సహా ఇప్పటి వరకు 9 సంస్థలు మొదటి చివరి మైల్ కనక్టివిటీ కింద తమ సేవలు అందిస్తున్నాయని చెప్పారు. రోజు మెట్రో రైలులో ప్రయాణం చేస్తున్న సుమారు 5లక్షల మందిలో 1.25లక్షల మందిని ఈ సంస్థలో వాహనాలు వారి వారి గమ్యాలకు చేరుస్తాయని తెలిపారు. వీటిలో మహిళా ప్రయాణీకుల కోసం కూడా ప్రత్యేకంగా మహిళలే నడిపే ద్విచక్ర ఎలక్ట్రిక్ వాహనాలను ఇప్పుడు తొలిసారిగా ఈ వీ జిప్ ఈషా పేరున ప్రవేశపెట్టడం జరిగిందని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. ఈ వాహనాలను వందకు పైగా పరేడ్ గ్రౌండ్స్ ,సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్ల నుండి మల్కాజ్ గిరి ,సైనిక్ పురి ,ఈసీఐఎల్ వంటి ప్రాంతాలకు ఎక్కువగా నడుపుతున్నామన్నారు. వీటిని త్వరలోనే ఇతర స్టేషన్లకు విస్తరిస్తారని ఆయన తెలియజేసారు. హైదరాబాద్ ని ప్రపంచ నగరాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే పాతనగరంలో ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణ్ గుట్ట వరకు ప్రారంభించిన రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా జరగుతున్నాయని ఆయన తెలిపారు. మొత్తం 1100ఆస్తులకు గాను 170 ఆస్తులకు నష్ట పరిహారం రూ 80 కోట్లు చెల్లించామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రానున్న కొద్ది రోజుల్లో మరో 80కోట్ల రూపాయల పరిహారం చెల్లించేలా ఆస్తుల ఓనర్షిప్ డాక్యుమెంట్ల పరిశీలన జరుగుతుందని ఆయన అన్నారు. పరిహారం చెల్లించిన ఆస్తుల కూల్చివేతలు కూడా జోరుగా సాగుతున్నాయని ఆయన తెలియజేసారు. మొత్తం 270మంది యజమానులు ఇప్పటికే స్వచ్ఛందంగా తమ ఆస్తులను మెట్రో రైలు నిర్మాణం కోసం ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టీ మెట్రో రైలు సీనియర్ అధికారులు మురళీ,వరదరాజన్,రిషివర్మ,కియోలిస్ ,మెట్రో ఎండీ ఎస్ సి మిశ్రా,ఈవీ జిప్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీధర్ శివలెంక,సీతారాం చెరుకుపల్లి పాల్గొన్నారు.



భారత గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన పోలీసుల సన్నాహక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీసు బలాల కవాతు విన్యాసాలు అద్భుతంగా ఆకట్టుకున్నాయి.

## రాజకీయాల్లో క్రియాశీల నాయకుడు పరిటాల రవి



పరిటాల రవి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్

**నిజాంపేట్, జనవరి 24, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్లో పరిటాల రవి 20వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ వారి చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిటాల రవి మంత్రిగా ఉన్న సమయంలో వారు ప్రజలకు చేసిన సేవలు గొప్పవని కొనియాడారు. అలాగే పేద ప్రజలకు అండగా నిలిచిన ప్రజా నాయకుడు పరిటాల రవి అన్నారు. వారి సేవలు ఎల్లప్పుడూ ప్రజల మధ్యలో మెదులుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ జెట్టి కుసుం కుమార్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నర్సి రెడ్డి భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజవర్గం ఇంచార్జ్ హనుమంత్ రెడ్డి, కూకట్ పల్లి నియోజవర్గం ఇంచార్జ్ బండి రమేష్, బండి శ్రీనివాస్ గౌడ్, పులి సందీప్, మోతి శ్రీనివాస్ యాదవ్, అర్వ వెంకట్, గుమస్తా మధు, ప్రభాకర్ రెడ్డి నిర్వాహకులు నీలపాటి కరుణాకర్ రావు, సుందూరి అనంత చౌదరి, అంతయ్య, శశి, కోటేశ్వరరావు, వంశీ, రమేష్, శివాజీ, పరిటాల రవి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నాకు పదోన్నతి రాకుండా కుట్ర : శ్రీనివాస్ ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న వికలాంగ టీచర్ శ్రీనివాస్

**సైఫాబాద్, జనవరి 24 ప్రభాతవార్త:** తనకు పదోన్నతి దక్కనీయకుండా సస్పెండ్ చేసేందుకు కుట్రపన్నుతున్న అధికారిపై తగు చర్యలు తీసుకోవాలని ఒక వికలాంగ ఉపాధ్యాయుడు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎన్ఎస్ఎస్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసిఫ్నగర్లోని సిసి నగర్లోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేసు_న్న సెకండరీ గ్రేడ్ టీచర్ బూర శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ గురువారం తాను పాఠశాలకు వెళ్ళి సమీపంలో ఉన్న ఆసిఫ్నగర్-1 మండలి కార్యాలయంలోకి వేతనం బిల్లు కోసం వెళ్ళడం జరిగిందన్నారు. కాగా ఇంతలోనే ఆ కార్యాలయంలోని మండలి విద్యాశాఖాధికారి ఎం.డి.ముస్తాఫ స్కూల్లోకి వచ్చి అటెండెన్స్ రిజిస్టర్లో తాను పాఠశాలకు హాజరుకాలేదని రిమార్క్ వేయడం జరిగిందన్నారు. ఆయన తనపైన కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, పదోన్నతి రాకుండా కుట్ర పన్నుతున్నారని, తక్షణమే ఆయనపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మయ్యగౌడ్ కూడా పాల్గొన్నారు.

## లక్ష డప్పులు-వేల గొంతులకు మద్దతు ప్రకటించిన ఎంఆర్పిఎస్



అభివాదం తెలుపుతున్న ఎంఆర్పిఎస్ నాయకులు

**సైఫాబాద్, జనవరి 24 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్ నగరంలో ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నిర్వహించతలపెట్టిన 'లక్ష డప్పులు వేల గొంతులు' కార్యక్రమానికి జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎంఆర్పిఎస్), జాతీయ మహాజన పోరాట సమితి (ఎంపిఎస్) సంపూర్ణంగా మద్దతు పలికాయి. శుక్రవా రం బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఆర్పిఎస్, ఎంపిఎస్ జాతీయ అధ్యక్షుడు బి.ఎన్.రమేష్మాదిగ మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని, దీని ఆధారంగా ఎంఆర్పిఎస్, ఎంపిఎస్, ఎంఎస్పి, ఎంఎంఎస్, ఎంవైఎస్ సంఘాల తరపున తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. నిండు అసెంబ్లీలో సిఎం రేవంత్రెడ్డి సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ప్రకటించారని, వర్గీకరణ కోసం ఒక కమిటిని కూడా నియమించడం జరిగిందున తక్షణమే వర్గీకరణకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘాల నాయకులు టి.సంపత్, గద్దల కుమార్, ఈ.శ్రీనివాస్, అలేవెల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికలో నూతన మరుగుదొడ్లు ప్రారంభం



శ్మశాసన వాటికలో మరుగుదోడ్లను ప్రారంభిస్తున్న బిజెపి నాయకులు గోవింద్రాఠి

**గన్ఫౌండ్రి, జనవరి 24ప్రభాతవార్త:** శ్మశాసన వాటికలో దహన సంస్కారాలకు వచ్చే వారికి సౌకర్యార్థం ఇమ్లీబన్ శ్మశాసనవాటికలో నూతనంగా ఏర్పాటు చేసిన బాత్రూమ్లతోపాటు మరుగుదొడ్లను బిజెపి నాయకులు, రాజస్థానీ ప్రగతి సమాజ్ ప్రధాన కార్యదర్శి గోవింద్రాఠి ప్రారంభించారు. ప్రగతి సమాజ్ అధ్యక్షులు కమల్నారాయణ అగర్వాల్ ఆధ్వర్యంలో రాజస్థానీ ప్రగతి సమాజ్ నిర్వహిస్తున్న ఇమ్లీబన్ క్రియేషన్ గార్డెన్లో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో నందగోపాల్బట్వాడా, మహేంద్రవ్యాస్, అజయ్శర్మ, అఖిలేష్కుమార్, చిత్తరంజన్ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ డిపోలో ఘనంగా డ్రైవర్స్డే



ఉత్తమ డ్రైవర్లను అభినందిస్తున్న ఆర్టీసి రీజినల్ మేనేజర్ రాజశేఖర్, బీమ్రెడ్డి, సుధాకర్ తదితరులు

**అడ్డగుట్ట, జనవరి 24 ప్రభాతవార్త:** విధి నిర్వాహనలో ఉన్న డ్రైవర్లు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసి సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ రాజశేఖర్, డిప్యూటీ ఆర్.ఎం. బీమ్రెడ్డిలు తెలిపారు. డ్రైవర్ ్స డే ను పురస్కరించుకొని శుక్రవారం కంటోన్మెంట్ డిపోలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసం గించారు. డ్రైవర్లు రోడ్డు భద్రతా సూత్రాలను పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలు జరపకుండా ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను పూలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో కంటోన్మెంట్ డిపో మేనేజర్ సుధాకర్ రావ్, ట్రాఫిక్ మేనేజర్ శ్రీపతి క్రిష్ణ, వరలక్ష్మి, కేంద్రియ విద్యాలయం విద్యార్థు లతో ర్యాలీ నిర్వహించారు. పాల్గొన్నారు.

## విఎన్ఆర్ విజెఐఈటిలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

**నిజాంపేట్, జనవరి 24, ప్రభాతవార్త**

ప్రగతినగర్ లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో "డిజిటల్ హ్యూమానిటీస్" గురించి మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. వివిధ రంగాలకు, సంస్థలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు చర్చల్లోనూ, కీలకోపన్యాసకులుగా పాల్గొని సదస్సుని విజయవంతం చేసారని సమన్వయకర్త డా వై. వి. సుధాదేవి తెలిపారు. కళలు, సామాజిక, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల దృక్కోణాల మేళవింపుగా మానవత కేంద్రంగా డిజిటల్ భవిష్యత్తు అన్న సదస్సు ఇతివృత్తానికి అనుగుణంగా ప్రజారోగ్యభద్రత, వైద్యసేవల గురించి చర్చాకార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ సదస్సులో విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డా.ఎ.వి. గురవారెడ్డి మాట్లాడుతూ మానవీయశాస్త్రాల్లో సాంకేతికత వాడటం వలన కొత్త అవకాశాలే కాక ఇబ్బందులు కూడా రావచ్చని హెచ్చరించారు. డిజిటల్ సాంకేతికతలు అందుబాటులో ఉండటం వలన వైద్యులు సుదూరంగా ఉన్న పేషెంట్లని కూడా కనిపెట్టుకుని ఉండవచ్చని చెబుతూ సామాజికమాధ్యమాల ద్వారా, యూట్యూబ్ వంటి వేదికల ద్వారా రీళ్ళు, దృశ్యకాలు చేసి చాలా మంది వైద్యులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంతర్జాలం వలన ప్రజలకు విషయసేకరణ సులభమైందని, వాటిలో నిజానిజాలను నిర్ధారించుకోవడానికి అనుభవమున్న నిపుణుల సలహాలు మాత్రమే తీసుకోవాలే తప్ప శస్త్రచికిత్స అక్కర్లేకుండా అన్ని ఇబ్బందులూ నయమైపోతాయంటూ నకిలీ వైద్యులు తెలిసీ తెలియకుండా ఇచ్చే సలహాల వలన ఆరోగ్యం మరింత దెబ్బతినే అవకాశముందని స్పష్టం చేసారు. కోవిడ్19 వలన మారిన పరిస్థితులలో సమాచార మార్పిడిలో వచ్చిన పలుమార్పులను, మునుపెన్నడూ లేని ఆన్లైన్ మోసం వంటి వింత పరిస్థితులను కూడా వక్తలు ప్రస్తావించారు. ఈ సదస్సులో భాగంగా డిజిటల్ పోస్టర్ ప్రదర్శనతో పాటు లఘుచిత్రాల పోటీ కూడా నిర్వహించగా ముగింపు కార్యక్రమంలో ఎంపిక చేసిన లఘుచిత్రప్రదర్శన జరిగింది. డిజిటల్ సాంకేతికాభివృద్ధి వలన మన రోజువారీ జీవితాల్లోని వివిధాంశాల్లో వచ్చిన మార్పులను, సామాజిక, వృత్తిగత జీవితాల్లో ఆవిష్కరించబడిన నూతనావకాశాలను, పరిశోధనల వలన అందివచ్చిన నూతన విద్యాబోధనా పద్ధతులు, సమాజాన్నీ మానవీయశాస్త్రాలనూ అర్థం చేసుకుని సమన్వయపరచుకోవలసిన అవసరాన్ని ఈ సదస్సు నొక్కిచెప్పిందని ఆంగ్ల భాషావిభాగాధిపతి డా.కె. నీలవేణి తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రధానాధ్యాపకులు ఆచార్య డా సి.డి. నాయుడు, సంచాలకులు ఆచార్య డా బి. చెన్నకేశవరావు, విఎన్ఆర్ విజెఐఈటితో సహా వివిధ విద్యా సంస్థలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న పరిశోధకులు, విద్యావేత్తలు

## ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి : బొజ్జ రమేష్

**నాచారం, జనవరి 24 ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజిగిరి పరిధిలో పనిచేస్తున్న పారశుద్య కార్మికులకు కనీన వేతనం రూ. 26వేలు ఇవ్వాలని దళిత జనసమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాచారంలో మాట్లాడుతూ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. జిహెచ్ఎంసి పరిధిలో 100 కార్పొరేషన్ డివిజన్లలో 20వేల మంది మున్సిపల్ సిబ్బంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎన్ఎంఆర్ ఫిక్స్డ్ పై తదితర పద్ధతుల్లో ఉద్యోగులు కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్ కాలేదని వారికి. కనీస వేతనాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్లలో కార్మికులకు ఎలాంటి రక్షణ పరికరాలను కల్పించకపోవడంతో పనిచేసే క్రమంలో ప్రమాదాల్లో అనేకమంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పరిశుద్ధ కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని శాశ్వతమైన పనులకు శాశ్వతమైన కార్మికులను నియమించాలని రాజ్యాంగం సుప్రీంకోర్టు హైకోర్టు చెబుతున్నప్పటికీ ఏ ఒక్కటి కూడా అమలుకు నోచుకోవడం లేదన్నారు. అదే మాదిరిగా స్వీపర్లకు జాడు కట్టలు. రైన్ కోట్లు. స్వెటర్లు. సబ్బులు చెప్పులు బట్టలు కొబ్బరి నూనె. స్వీపర్లకు ఇతర సామాగ్రిని అందజేయాలన్నారు. రాత్రి డ్యూటీ చేసేవారికి ట్రాన్స్పోర్ట్ సౌకర్యం పని ప్రదేశాల్లో రెస్టు రూములు ఏర్పాటు చేయాలని కోరారు.. స్వచ్ఛ ఆటో కార్మికులను మున్సిపల్ కార్మికులు గా గుర్తించి వారి సేవలను కొనసాగించాలని వారికి ఆరోగ్య సంక్షేమ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆదివారాలు పండుగ సెలవులు ఇవ్వాలని ఏడాదికి 15 రోజులు క్యాజువల్స్ సెలవులను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న బొజ్జ రమేష్

## పారదర్శకంగా సర్వే నిర్వహించి న్యాయం చేయండి

**హైదరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:**

న్యాయస్థానం ఆదేశాల మేరకు పారదర్శకంగా రీసర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి అమీన్పూర్ నేతాజీ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, ఉపేంద్రలు మాట్లాడారు. 1980వ దశకంలో చిరు ఉద్యోగాలు చేసుకునే తామంతా బ్యాంకుల నుంచి రుణాలు పొంది సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ గ్రామం సర్వే నెంబర్ 130 నుంచి 135 లలోని స్థలాలను కొనుగోలు చేశామని తెలిపారు. తమ స్థలాలకు సమీపంలో ఉన్న భూములను కొనుగోలు చేసిన కృష్ణంరాజు అక్రమంగా తమ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై తాము 2006 లో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం సమగ్ర సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. కాగా నల్గొండ జిల్లాకు చెందిన ఓ ప్రజా ప్రతినిధి ఒత్తిళ్లతో అధికారులు కబ్జా కు యత్నిస్తున్న వ్యక్తికి అనుకూలంగా సర్వే నిర్వహించారని ఆరోపించారు. శాశ్వత ల్యాండ్ మార్కింగ్ నుంచి నిర్వహించాల్సిన సర్వేను అందుకు విరుద్ధంగా నిర్వహించడంతో తాము అడ్డుకునేందుకు ప్రయత్నించామని తెలిపారు. కాగా స్థానిక పోలీసులు బాధితులైన తమనే అడ్డుకున్నారని వాపోయారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని ఎలాంటి ఒత్తిళ్లకు లొంగని అధికారిచే రిసర్వే నిర్వహించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే కుటుంబాలతో సహా ఆత్మహత్యలకు పాల్పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని కన్నీరు మున్నీరు అయ్యారు.



ప్రెస్క్లబ్లో మాట్లాడుతున్న అమీన్పూర్ బాధితులు

## ప్రభుత్వ పాఠశాలలకు మావంతు చేయూతనందిస్తాం

**నార్సింగి, జనవరి 25 ప్రభాతవార్త :**

ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు మావంతు చేయూతనందిస్తున్నామని ఐడిబిఐ బ్యాంకు ప్రాంతీయ కో ఆర్డినేటర్ విశ్వనాథ్ ప్రభు పేర్కొన్నారు. శుక్రవారం మణికొండలో ఉన్న ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఐడిబిఐ బ్యాంకు తరపున రూ.2లక్షల విలువ చేసే రెండు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లను మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్రెడ్డి, ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డిలతో కలిసి ప్రధానోపాధ్యాయులు నిరంజన్, దశరథ్లకు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ ప్రభు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా నాణ్యతలు బాగా మెరుగు పడ్డాయని సంతోషంను వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలకు అదనంగా స్వచ్ఛంద సంస్థలు కూడా చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. మావంతుగా గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలకు సహకారం అందజేస్తున్నామని వివరించారు. అనంతరం నరేందర్రెడ్డి, రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ఐడిబిఐ బ్యాంకు ప్రతినిధులు మణికొండ ప్రభుత్వ పాఠశాలలకు చేసిన సహాయం మరువలేనిదన్నారు. వారిచ్చిన కంప్యూటర్లు, ప్రింటర్లతో విద్యార్థులకు మాస పరీక్షలు, ఫ్రీఫైనల్ టెస్టులు పెట్టేందుకు చాలా ఉపకరిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంకు మేనేజర్ వీరరాజు, ప్రతినిధులు అఖిలేష్, జైసింగ్, గ్రామ పెద్దలు బుద్దోలు శ్రీరాములు, శ్రవణ్, బీరప్ప, రవికాంత్రెడ్డి, ఆనంద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ప్రభుత్వ పాఠశాలలకు రెండు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేస్తున్న ఐడిబిఐ బ్యాంక్ ప్రతినిధులు విశ్వనాథ్ ప్రభు దృశ్యం.

## కాంగ్రెస్ పార్టీకి యువజన విభాగం వెన్నుముక

**చార్మినార్, జనవరి 24 ప్రభాతవార్త :**



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాతనగరంలో శుక్రవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి శశి యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న బహదూర్పుర, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్పుర అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీలు పులిపాటి రాజేష్ కుమార్, ముజీబుల్లా షరీఫ్, బోయ నగేష్, కె.రవిరాజ్లు కొత్తగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ నాయకులకు శాలువ కప్పి దిశానిర్దేశం చేయటం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యువజన విభాగం వెన్నుముక లాంటిదని, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ నాయకులు వారధిలా పని చేయాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు యువజన కాంగ్రెస్ నాయకులపై ఆధార పడి ఉందని, పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయటానికి అందరం కలిసి కట్టుగా పని చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు రాహుల్ సుతారం, చార్మినార్ నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్ ఫయాజ్, బహదూర్పుర నియోజకవర్గం అధ్యక్షులు సాయి యాదవ్, యాకుత్పుర నియోజకవర్గం అధ్యక్షులు మజీద్ పశ, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పవన్ కళ్యాణ్ యాదవ్, ఇబ్రహిం, రాహుల్ గౌడ్, మనోహర్ చారి, లడ్డూ, పటేల్, నియోజకవర్గాల ఉపాధ్యక్షులు భాను యాదవ్, నర్సింహ్మా, శ్యామ్సింగ్, కార్తీక్, సందీప్, దినేష్, శివానంద, సయ్యద్ అక్బర్ హుస్సేన్, సాయి కిరణ్, జిల్లా ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు పాల్గొన్నారు.

## రైల్వే ట్రాక్ మెన్ల సమస్యలు పరిష్కరించాలి : శంకర్ రావ్

**కంటోన్మెంట్, జనవరి 24 ప్రభాతవార్త:** దక్షిణ మధ్యరైల్వేలోని ఇంజనీరింగ్, ట్రాక్ మెన్ల విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 6 గంటల పని విధానంను అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్. శంకర్ రావ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్ వద్ద రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. రైల్వేలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటి పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె.శ్రీనివాస్, మజ్దూర్ యూనియన్ నేతలు ఉదయ భాస్కర్, బరాటే, రామక్రిష్ణ, రవిందర్, ఖాజా, సరోజిని రెడ్డి, నరిసింహ్మా రెడ్డి, సిసి.అధ్యక్షులు చిలుక స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను పర్మినెంట్ చేయాలి

**సైఫాబాద్, జనవరి 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ను పర్మినెంట్ చేయాలని, లేని పక్షంలో కనీసం పేస్కేల్ ప్రకారం వేతనం చెల్లించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రల కల్పించాలని సుప్రీంకోర్టు, హైకోర్టు ఈ మేరకు తీర్పులు కూడా ఇవ్వడం జరిగిందని వారన్నారు. తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ జెఏసి ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో విశ్వవిద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు-ఒప్పంద ఆధ్యాపకుల పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సులో ఎంఎల్సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్ తదితరు లు ప్రసంగించారు. అసలు కాంట్రాక్ట్ వ్యవస్థఅప్రజాస్వామి కమని, కాం ట్రాక్ట్ వ్యవస్థను మొత్తంగా రద్దు చేయాలని, వారిని రెగ్యుల రైజ్ చేయాలని, అలాగే విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తే మ రింతగా ఉత్సహంతో పనిచేస్తారని చెప్పారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ వెంకటేష్, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.ఉపేందర్, డా.వెల్పుల కుమార్, డా.రెష్మా పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ ఎం.కోదండరామ్

## సర్వేయర్ల ఉద్యోగాలను డైరెక్ట్ రిక్రుట్ మెంట్లోనే భర్తీ చేయాలి : ఆర్.కృష్ణయ్య

**తార్నాక, జనవరి 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో డిప్యూటీ సర్వేయర్ ఉద్యోగాలను డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా నేరుగా భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగాలను వీఆర్వో, వీఆర్ఎల ద్వారా కాకుండా బీటెక్, డిప్లొమా, ఐటీఐ సివిల్ ఇంజినీరింగ్ అభ్యర్థులతోనే నింపాలని కోరారు. డిప్యూటీ సర్వేయర్ ఉద్యోగాలను వీఆర్వో, వీఆర్ఎల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నిరుద్యోగ జేఏసీ చైర్మెన్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా ఆర్. కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి టెక్నికల్ నాలెడ్జ్ లేనివారితో ఆయా ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. సాంకేతిక పరిజ్ఞానం లేనివారితో ఆ ఉద్యోగాలను భర్తీ చేస్తే భూ సర్వేలలో తప్పులు జరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. దీంతో ప్రజలు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాకాకుండా టెక్నికల్ అర్హత కలిగిన వారితో ఉద్యోగాలను భర్తీ చేస్తే సరైన సర్వే ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, నిఖిల్ పటేల్, రాజు, పవన్, ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపి. ఆర్.కృష్ణయ్య తదితరులు

## తెలంగాణ ఉద్యమ నేత రాజయ్య మృతి

**కంటోన్మెంట్, జనవరి 24 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 5వ వార్డు వాల్మీకి నగర్లో నివాసం ఉంటున్న తెలంగాణ ఉద్యమ నేత పెద్దాల నరి ్సంహా తండ్రి రాజయ్య (70), ఈ నెల 23న అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మరణ వార్త తెలియగానే తెలంగాణ ఉద్యమ నేతలు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మన్నె క్రిషాంక్, గజ్జెల నాగేశ్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్, నళిని కిరణ్, అనితా ప్రభాకర్, శ్యామ్ కుమార్లతో పాటు కంటోన్మెంట్కు చెందిన తెలంగాణ ఉద్యమ నేతలు పాల్గొని రాజయ్య భౌతికఖాయంపై పుష్పగుచ్ఛాలు అందజేసి శ్రద్ధాంజలి ఘటించారు.

## ఖాళీ పోస్టులను వెంటనే విడుదల చేయాలి

**గోషామహల్, జనవరి 24ప్రభాతవార్త:** పవర్ సెక్టార్లో ఖాళీగా ఉన్న 4నాలుగు వేళ్ల పోస్టులను వెంటనే విడుదల చేయాలని గాంధీ భవన్ ముందు నిరుద్యోగులు నిరసన వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100రోజుల్లో నిరుద్యోగులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామి ఇచ్చి ఇప్పటికి ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. జాబ్ క్యాలెండర్ప్రకారం అక్టోబర్ 2024లో విడుదల కావాలసిన విద్యుత్ సంస్థలో టిజి ట్రాన్స్కో, టిజి ఎంపిడిసిఎల్, టిజి డిసిఎల్, అసిస్టెంట్సబ్ ఇంజనీర్, జూనియం లైన్మెన్లకు సంబంధించి దాదాపు 4వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్శాఖ మంత్రిగా కొనసాగుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్క వివిధ సందర్భాల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పినట్లు చెప్పారు. గాంధీభవన్కు భారీగా నిరుద్యోగులు చేరుకున్నారు. ఇంజనీరింగ్, ఐటిఐ, డిప్లమా చదువుకున్నమాకు ఉద్యోగాలు లేక కుటుంబపోషణలో ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నట్లు వాపోయారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని విద్యుత్శాఖలో ఉన్న ఖాళీ పోస్టులకు నోఫిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకకు నిదర్శనమే నాగార్జున

### - కార్పొరేటర్ కొలుకుల జగన్

**జగద్గిరిగుట్ట, జనవరి 24 ప్రభాతవార్త**

కార్మికవాడలలో విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా అక్షరకుసుమాలను అందించిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట నాగార్జున హైస్కూల్ వార్శికోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల కరస్పాండెంట్ గిరి అధ్యక్షతన నిర్వహించిన సాంసృతిక కార్యక్రమాకు ఆయన అసోసియేషన్ చైర్మెన్ పి.శివయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్ కొలుకుల జగన్ మాట్లాడుతూ కార్మికవాడలలో నాగార్జున స్కూల్ విద్యాప్రమాణాల పెంపుదలలో నూతన ఒరవడి సృష్టించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలల అసోసియేషన్ చైర్మెన్ పి.శివయ్య మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా నాగార్జున హైస్కూల్ ఒక్కోమెట్టుఅధిగమించిందన్నారు. నాగార్జున హైస్కూల్ కరస్పాండెంట్ గిరి మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ శిక్షణ తో పాటు అన్ని రంగాలలో రాణించేవిధంగా ప్రత్యేకప్రణాళికలతో విద్యార్థుకు శిక్షణ, ఆత్మవిశ్వాసం నెలకొల్పుతున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారం తమపాఠశాల అభ్యున్నతికి ఎంతో కీలకమైనవన్నారు. అనంతరం వివిధ తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## భారతమాత హారతి కార్యక్రమానికి భూమి పూజ

**బేగంపేట జనవరి 24, ప్రభాతవార్త**

ఈ నెల 26వ తేదీన నెక్లెస్ రోడ్డులో జరగనున్న భారత మాత హారతి కార్యక్రమం నిర్వహించే ప్రాంతంలో శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దంపతులు భూమి పూజ చేసారు. అనంతరం బీజేపీ తెలంగాణా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ యావత్ భారతదేశంలోని ప్రజలను కపాడుతున్న తల్లి భారతమాత అని ఆన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో గడచిన 8సంవత్సరాలుగా భారతమాత మహాహారతి కార్యక్రమాన్ని చేపట్టి ప్రతిష్టాత్మంగా చేపట్టి నిర్వహిస్తున్నారని అన్నారు. భారత మాతకు సప్త హారతులు ఇచ్చి రైతులు, మహిళలు ,విద్యార్థులు సైనికులు వారి కుటుంబాలు బాగుండాలని ,బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి హారతిచ్చి సమాజాన్ని కాపాడాలని వేడుకుంటూ మహాహారతి కార్యక్రమం చేపడుతున్నారని అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత మాత మహాహారతి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిధిగా పాల్గొంటారని అన్నారు. సాంస్కృతిక కార్య క్రమాల్లో 2వేల మంది విద్యార్థులు కాషాయి వస్త్రాలు ధరించి పాల్గొంటారని తెలియజేసారు. శనివారం భారత మాత విగ్రహం ఊరేగింపులో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమానికి మహంకాళీ జిల్లా అధ్యక్షుడు బూరుగుల శ్యాంసుందర్ గౌడ్ చైర్మన్ గా వ్యవహరిస్తుండగా గౌతంరావు ఆధ్వర్యంలో కార్యకర్తల సమీకరణ జరుగుతుందన్నారు.

## బడ్జెట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక

### రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీపతి శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జగ్గు మల్లారెడ్డి



నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గం

**హైదరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:**

బడ్జెట్ స్కూల్, చిన్న తరహా స్కూల్స్ పరిరక్షణ ధ్యేయంగా శుక్రవారం బిస్మాట్ కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. 25 జిల్లాల నుండి వచ్చిన ప్రైవేట్ స్కూల్స్ ప్రతినిధులు ఈకార్యక్రమంలో పాల్గొనగా కత్తి వెంకటస్వామి ఎన్నికల అధికారిగా వ్యవహరించి రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీపతి శేఖర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా సిద్దిపేట జిల్లాకు చెందిన జగ్గు మల్లారెడ్డి, కోశాధికారిగా హైదరాబాద్ కు చెందిన జె.శ్రీనివాస్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుజ్జ సత్యం, షేక్ షరీఫ్, కె.దయాకర్ రెడ్డిని, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా పి.జలందర్ రెడ్డి సలహాదారుడిగా రాధాకృష్ణ, టీ.బుచ్చిరెడ్డిలను ఎన్నుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలకు పరిష్కారం చూసే విధంగా కృషి చేస్తామని నూతనంగా ఎన్నుకోబడిన రాష్ట్ర కార్యవర్గం తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ, ఆర్ కృష్ణయ్య, స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఎమ్మెల్సీ ఏవియన్ రెడ్డి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎపిసిసి ఓబీసీ కత్తి వెంకటస్వామి విచ్చేసి కొత్తగా స్థాపించిన బిస్మార్ట్ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జి.నారాయణ రెడ్డి, కార్యదర్శి ఏ.భరత్ కుమార్, కోశాధికారి సిహెచ్ మీనెందర్ రావు పాల్గొన్నారు.

## సావిత్రీభాయి పూలే జాతీయ అవార్డు అందుకున్న దుర్గాదేవి



గుంటూరులో సావిత్రి భాయి పూలే జాతీయ అవార్డును అందుకుంటున్న చతుర్వేదుల దుర్గాదేవి దృశ్యం

**నార్సింగి, జనవరి 24 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామానికి చెందిన చతుర్వేదుల దుర్గాదేవి సావిత్రీభాయి పూలే జాతీయ అవార్డు ను అందుకున్నారు. ఈ నెల 19.వ,తేదీన గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆంధ్రప్రదేశ్కు చెందిన ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావ్, సంఘం అధ్యక్షులు నాగయ్యలు దుర్గాదేవికి ఈ అవార్డును ప్రదానం చేశారు. దుర్గాదేవి పుప్పాలగూడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తెలుగు హెచ్ఓడిగా పని చేస్తున్నారు. ఆంగ్లమాధ్యమం క్రేజ్లో కొట్టుకుపోతున్న నేటి రోజుల్లో కమ్మనైన అమ్మభాషలోని మాధుర్యంను ఆధునిక విద్యార్థులకు రుచి చూపిస్తూ, వారిలో తెలుగు భాషపై పట్టును పెంచేందుకు గత 15.ఏళ్లగా కృషి చేస్తున్నారు. దుర్గాదేవికి జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల ఆమె పని చేస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ శిల్పారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఉషా తన్మయ్, తోటి ఉపాధ్యాయ గణం శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు.

## కార్మిక కోడ్ ల అమలు ఆలోచన వెనక్కి తీసుకోవాలి

**చిక్కడపల్లి, జనవరి 24 ప్రభాతవార్త:** కార్మిక కోడ్ ల అమలు ఆలోచన వెనక్కి తీసుకోవాలని దొడ్డి దారిన రైతాంగ వ్యతిరేక చట్టాలు అమలు వెనక్కి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ లో 2.50 లక్షల కోట్లను కేటాయించాలన్నారు. శుక్రవారం ఆర్టీసిక్రాస్ రోడ్స్లోని రైతుసంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆందోళనలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి గిట్టుబాటు ధరల చట్టాన్ని తెస్తామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా దొడ్డి దారిన మార్కెటింగ్ సవరణల చట్టాన్ని అమలు చేయడం తక్షణమే ఆపాలని, కార్మిక కోడ్ల అమలు ఆలోచన విరమించుకోవాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి 2.50 లక్షల కోట్లు బడ్జెట్ లో కేటాయించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా జనవరి 26న ట్రాక్టర్ ర్యాలీలు ప్రదర్శనలు నిర్వహించాలని సిఐటియు, అఖిలభారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా అన్ని జిల్లా కేంద్రాలలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రతినిత్యం ప్రజా సంక్షేమం కోసం కృషి : మేయర్


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్

**నిజాంపేట్, జనవరి 24, ప్రభాతవార్త**

ప్రతినిత్యం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప 31,32,33వ డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కమిషనర్ సాబేర్ అలి, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప మదర్ థెరిస్సా విగ్రహం నుండి సాయిబాబా గుడి వరకు సెంట్రల్ లైటింగ్ పోల్స్, అంబేద్కర్ విగ్రహం నుండి దర్గా వరకు సీసీ రోడ్, రాజీవ్ గృహకల్ప బ్లాక్ నెం.02 నుండి 17 18 వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్, అలాగే వార్డ్ 33లో సీసీ రోడ్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, ఆగం పాండు ముదిరాజ్, సురేష్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, వెంగయ్య చౌదరి, నాగరాజ్ యాదవ్, తలారి సాయి ముదిరాజ్, మాజీ ప్రజాప్రతినిధులు రాజీవ్ గృహకల్ప 31,32,33వ డివిజన్ల సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి హౌస్ అరెస్ట్


బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు.

**బేగంపేట జనవరి 24, ప్రభాతవార్త**

బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరిని శుక్రవారం బేగంపేట పోలీసులు హౌస్ అరెస్ట్ చేసారు. కేపీహెచ్‌బీ పరిధిలోని హౌజింగన బోర్డు ఖాళీ స్థలాలను అధికారులు శుక్రవారం వేలం నిర్వహించను న్నారు. గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వేలం ను అడ్డుకుంటామని ప్రజలను హౌజింగ్ బోర్డు అధికారులు మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా శుక్రవారం వేలం నిర్వహించనున్న నేపధ్యంలో బీఆర్ఎస్ నేతలను హౌజ్ అరెస్ట్ చేసారు. బేగంపేట ఇన్స్‌పెక్టర్ చిర్ర రామయ్య ఆధ్వర్యంలో కార్పొరేటర్ ని హౌజ్ అరెస్ట్ చేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుందని, పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారి పట్ల నిర్బంధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. హౌజింగ్ బోర్డు ఖాళీ స్థలాల రక్షణకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పోరాటం చేస్తున్నారని, అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, రాజయ్య, ఆరిఫ్. పాల్గొన్నారు.

## తైబజార్ వేలం

**నిజాంపేట్, జనవరి 24, ప్రభాతవార్త** : నిజాంపేట్ నగర పాలక సంస్థ, పరిధిలో ప్రగతి నగర్ నిజాంపేట్, బాచుపల్లి, రోజువారీ, వారాంతపు మార్కెట్లు (తైబజారు) యొక్క వేలము 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు కాల వ్యవధికి (కాలపరిమితి 01.02.2025 నుండి 31.03.2025 వరకు కాలమునకు మాత్రమే) కమిషనర్ ఆధ్వర్యంలో తేదీ. 31-01-2025 రోజున ఉదయం 11.30 గంటలకు తైబజార్ బహిరంగ వేలము నిర్వహించబడును. తైబజార్ వేలము ప్రారంభధర (సర్కారీ వారి పాట రూ. 3,00,000లుగా వేలం పాటలో అత్యధిక రుసుము ను పాడిన వేలముదారు ఒక మాసము రుసుమును అగ్రిమెంట్ సమయములో డిపాజిట్ రూపములో చెల్లించవలయును, మిగతా రుసుమును ఒక నెల రోజుల తరువాత సర్దుబాటు చేయవలెను. ఆసక్తి గల వారు మునిసిపల్ కార్యాలయము నందు రూపాయలు రూ.1500 నగదు చెల్లించి లేదా కమీషనర్ నిజాంపేట్ నగర పాలక సంస్థ హైదరాబాద్ నందు చెల్లుబాటు అయ్యే డిమాండ్ డ్రాఫ్ట్ ను సమర్పించి నియమనిబంధనలతో కూడిన దరఖాస్తును తేది. 25.01.2025 శనివారము ఉదయం 10.30 గం నుండి కార్యాలయములో పొందవచ్చును తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తును డిపాజిట్ రూ.1,00,000ల డిడి పాటు తేదీ 30.01.2025 సాయంత్రం 5:00గంటలోపు కార్యాలయములో సమర్పించగలరు.

## బిజెపి సూరారం డివిజన్ అధ్యక్షులుగా కేశవ్ యాదవ్

**పేట్‌బషీరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త**

బిజెపి మేడ్చల్ జిల్లా సూరారం డివిజన్ అధ్యక్షులుగా మద్ద కేశవ్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కేశవ్ యాదవ్ మాట్లాడుతూ తనకు సహకరించిన పార్టీ నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రత్యేకంగా ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని నమ్ముకుని నమ్మిన సిద్ధాంతం కోసం కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న గౌరవం ఇది అని అన్నారు. బిజెపి యువమోర్చా డివిజన్ అధ్యక్షుడిగా బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా అంచలంచెలుగా ఎదుగుతూ నేడు డివిజన్ బిజెపి అధ్యక్షుడుగా నియమించడం ఇది ఒక సాధారణ కార్యకర్తకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని కేశవ యాదవ్ అన్నారు. తనకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన నాయకులకు కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## మాధవి గోపాల్ రెడ్డిని సన్మానించిన కూన శ్రీశైలం గౌడ్


కూన శ్రీశైలం గౌడ్‌తో మాధవి గోపాల్ రెడ్డి

**పేట్‌బషీరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద కొంపల్లి మున్సిపల్ పట్టణ నూతన మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు చల్ల మాధవి గోపాల్ రెడ్డిని శుక్రవారం శాలువాతో సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ రోజువారి కార్యక్రమంలో భాగంగా తన నివాసం వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు విని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లేబర్ సెల్ ప్రెసిడెంట్ కందడి సుదర్శన్ రెడ్డి, కొంపెల్లి పట్టణ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బి ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, గోపాల్ రెడ్డి, గుంజ శ్రీనివాస్, బండి శ్రీనివాస్ గౌడ్, ఐలయ్య గౌడ్, కావలి గోపాల్, సంజీవ్ కుమార్, టైగర్ రాములు, నరసింహారెడ్డి, పరశు రాములు, రామ్ చందర్, శ్యామల, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో ఉన్నప్పుడే ప్రజాప్రతినిధులపై గౌరవం పెరుగుతుంది : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**నిజాంపేట్, జనవరి 24, ప్రభాతవార్త**

పదవిలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల్లో ఉన్నప్పుడే ప్రజా ప్రతినిధులపై గౌరవం పెరుగుతుందని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ చివరి సర్వసభ్య సమావేశానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మార్గదర్శకత్వంలో, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంపూర్ణ మద్దతుతో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి మోడ్రన్ కార్పొరేషన్‌గా అభివృద్ధి పరచామని అన్నారు. పదవీకాలం అనేది తాత్కాలికమని, పదవిలో ఉన్నా లేకున్నా ప్రజలతో మమేకమై ప్రజల్లో ఉన్నప్పుడే రాజకీయంగా వివిధ స్థాయిలో ఎదగగలమని అన్నారు. రానున్న రోజుల్లో కూడా కార్పొరేషన్ అభివృద్ధికై అందరూ పనిచేయాలన్నారు. అనంతరం నిజాంపేట్ కార్పొరేషన్ అభివృద్ధికై అహర్నిశలు కృషిచేసిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సేవల గురించి పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ మంచినీటి కొరతతో అల్లాడిన నిజాంపేట్ కార్పొరేషన్ కు కేసీఆర్ మానస పుత్రిక అయిన మిషన్ భగీరథ ద్వారా నీటి ఎద్దడిని తీర్చేందుకు ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికీ మరువలేమన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఒక విజన్ తో పనిచేసే విజనరీ నాయకులు, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అని అన్నారు. ఇంట్లో ఎవరైనా కాలం చేస్తే దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇక్కడి నుంచి కూకట్ పల్లి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది, కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వైకుంఠధామాల నిర్మాణంతో ప్రజల కష్టాలను తీర్చిన గొప్ప నాయకులు ఎమ్మెల్యే అని అన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ సాబేర్ అలి, మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన


ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ

**దుండిగల్, జనవరి 24 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక సంఘం పరిధి 26వ వార్డులో స్వంత నిధులతో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయం నిర్మాణ పనులకు బిఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం హయాంలో ఆలయాలను గణనీయంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పురపాలిక పరిధిలో ఆలయాల అభివృద్ధి తనవంతు సహకారం అందిస్తానన్నారు. పెద్దతల్లి ఆశీస్సులతో అందరూ బాగుండాలని అభిలషించారు. అంతకుముందు వార్డులో నూతనంగా నిర్మించనున్న కమాన్‌తో పాటు బీరప్ప ఆలయం వద్ద మెట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అర్కల అనంతస్వామి, వార్డు అధ్యక్షులు రమేష్‌ముదిరాజ్, కుర్మసంఘం కమిటి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

**బేగంపేట జనవరి 24, ప్రభాతవార్త**

నూతన సంవత్సరం లో ప్రజలందరికీ మేలు జరగాలని, వారు తలపెట్టిన ప్రతి పని విజయ వంతం కావాలని కోరుకుంటున్నానని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా. కోట నీలిమ అన్నారు. శుక్రవారం కోట నివాసం లో 2025సంవత్సరం నూతన క్యాలెండర్ ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ ప్రెసిడెంట్ త్రికాల మనోజ్ కుమార్, పెరమల చందు, నాగరాజ్, యాసిన్, రాజు, సమ్మి, శ్రీశైలం పాల్గొన్నారు.

## కొండపోచమ్మ చెరువు బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ముషీరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:** కొండపోచమ్మ చెరువులో ప్రమాదవశాత్తూ మునిగిపోయి ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్, బన్సీలాల్‌పేట్ చాచా నెహ్రూనగర్‌కు చెందిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, ముషీరాబాద్ బీజేపీ నేతలు పూసరాజు, రమేష్‌రాం పాల్గొన్నారు.

## ఐసిసి క్రికెట్ టోర్నమెంట్ మేనేజర్‌ను అభినందించిన ఎమ్మెల్యే తలసాని


క్రికెట్ టోర్నమెంట్ భారత జట్టు మేనేజర్ దేవరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**అడ్డగుట్ట, జనవరి 24 ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవరాజు ఐసీసీ క్రికెట్ టోర్నమెంట్‌కు భారత జట్టు మేనేజర్‌గా నియమితులైన సందర్భంగా శుక్రవారం మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దేవరాజుకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

## అడ్డగుట్ట డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి : లింగాని


శాస్త్రీ నగర్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

**అడ్డగుట్ట, జనవరి 24 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం శాస్త్రీ నగర్‌లో రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ తివారి, బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, మనోహర్, పొన్నాల రాజు, అమర్, వసంత, ఎండి. ఇస్మయిల్, ఎల్లయ్య, మోహన్, శంకర్, శ్రీరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : రామక్రిష్ణ

**కంటోన్మెంట్, జనవరి 24 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, కేంద్ర ప్రభుత్వ నిధులతనే అభివృద్ధి జరుగుతుందని నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. శుక్రవారం 2వ వార్డులోని 105 గల్లీలో రోడ్డు పనులు, ఇందిరమ్మ నగర్ పోచమ్మ గల్లీలో భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రావణ్, మాదరపు అశోక్, చిట్టిబాబు, శ్యామ్, మమత తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకురాలికి తలసాని ఘన నివాళి


నివాళులు అర్పిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**సికింద్రాబాద్, జనవరి 24 ప్రభాతవార్త:** పార్టీ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పాల్గొనే లావణ్య మృతి చాలా బాధాకరమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బన్సీలాల్ పేట డివిజన్ భోలక్ పూర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు లావణ్య గురువారం సాయంత్రం గుండెపోటుతో మరణించింది. విషయం తెలుసుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం భోలక్ పూర్‌లోని నివాసానికి వెళ్ళి ఆమె పార్ధీవ దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె భర్త, పిల్లలను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనే లావణ్య మృతి వార్త తనను ఎంతో కలచివేసిందని చెప్పారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. కార్పొరేటర్ కుర్మ హేమలత, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, డివిజన్ నాయకులు నివాళులు అర్పించారు.

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడి

**గచ్చిబౌలి, జనవరి 24 ప్రభాతవార్త**

పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువకుడు ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడి మోసం చేయడంతో యువతి రాయదుర్గం పోలీసులను ఆశ్రయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాధిత యువతి(22) బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి రాయదుర్గం పరిధిలోని బిఎన్ఆర్ హిల్స్‌లో ఓ ఇంట్లో కేర్ టేకర్‌గా పనిచేస్తుంది. కాగా ఇదే ప్రాంతంలో నివాసం ఉంటూ మేస్త్రీ పని చేసుకునే వీరబాబు(24)తో యువతికి మూడు నెలల క్రితం పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించిన వీరబాబు గతకొన్ని రోజుల క్రితం క్రిష్ణానగర్‌లోని ఓ ఓయో హోటల్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ యువతి మీద లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం వీరబాబును పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా, ముఖం చాటేశాడు. దీంతో బాధిత యువతి శుక్రవారం రాయదుర్గం పోలీసులను ఆశ్రయించింది. యువతి ఫిర్యాదుపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తామని తెలిపారు.

## స్టీల్ రాడ్లు దింపుతుండగా విద్యుదాఘాతం ..కార్మికుడు మృతి

**మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 24 ప్రభాతవార్త :**

స్టీల్ షాపులో డిసిఎం నుంచి స్టీల్ రాడ్డులను కిందికి దించుతున్న సమయంలో ప్రక్కనే ఉననన విద్యుత్ తీగ తగిలి కొండయ్య అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పైడి నాయుడు కథనం ప్రకారం....నల్గొండ జిల్లా, చందం పేట మండలం, కంచాలపల్లి గ్రామానికి చెందిన కొండయ్య (39) భార్య, ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి సంతోష్‌నగర్‌లోని న్యూ మారుతీనగర్‌లోనివాసం ఉంటున్నాడు. కాగా ఈ నెల 23వ తేదీ గురువారం రోజున కొండయ్య పర్వతాలు అనే వ్యక్తితో కలిసి లక్ష్మీగూడలోని వరుణ్ స్టీల్ షాపులో స్టీల్ లోడ్‌ను దించటానికి పనికి వచ్చారు. షాద్‌నగర్ నుంచి డిసిఎంలో వచ్చిన స్టీల్ రాడ్డులను కొండయ్యతో పాటు మరి కొంత మంది కిందికి దించుతున్నారు. అదే సమయంలో ప్రక్కనే విద్యుత్ వైరు కొండయ్యకు తగలటంతో షాక్‌కు గురై క్రింద పడిపోయాడు. కొండయ్యను చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన కొండయ్య కుటుంబానికి న్యాయం చేయలని బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. కొండయ్య భార్య రాధ ఫిర్యాదు మేరకు వరుణ్ స్టీల్ షాపు యజమానిపై మైలార్‌దేవ్‌పల్లి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మృతి చెందిన కొండయ్య కుటుంబ సభ్యులు

## భారత రాజ్యాంగ ఫలాలు అందిపుచ్చుకుని సామాజిక సాధికారత సాధించాలి"


ప్రసంగిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం

**చిక్కడపల్లి, జనవరి 24 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ ఫలాలను ప్రతీఒక్కరు అందిపుచ్చుకునేల ప్రజలు చైతన్యం కావాలని తద్వారా సామాజిక సాధికారత సాధించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం అన్నారు. భారత రాజ్యాంగానికి డెబ్బై అయిదు సంవత్సరాలు నిండిన సందర్భంగా పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, ప్రజా పర్యవేక్షణ కమిటీ సంయుక్త నిర్వహణలో భారత రాజ్యాంగం సామాజిక సాధికారత అనే అంశంపై రాష్ట్ర సదస్సు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించేందుకు, భావ ప్రకటన, స్వేచ్ఛ, సమానత్వపు హక్కులు కల్పించిందని అయితే రాజ్యాంగ అధికరణల పట్ల అవవాహన చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల ఇంకా వివక్షకు గురవుతున్నారని అన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో అరవై రోజులపాటు రాజ్యాంగ ప్రచారోద్యమం నిర్వహిస్తుండటం అభినందనీయమని అన్నారు. పీపుల్స్ మానిటరింగ్ కమిటీ జాతీయ కన్వీనర్ సత్యబాబు బోస్, రచయిత జిలుకర శ్రీనివాస్, కె వి పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి టీ, స్కైలాబ్ బాబు లు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి కృషి ఫలితంగా భారత రాజ్యాంగంలో అనేక అధికరణలు పొందుపరిచారని అందులోభాగమే పౌరహక్కుల చట్టమని అన్నారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ నాయక్, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్సింహ, ఎం ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, అసిమ్ డైరెక్టర్ ఎస్క్యూ మసూద్, తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం అధ్యక్షత వహించగా పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ బానోతు భాస్కర్ నాయక్, దిడ్డి యాదయ్య, కొమ్ము తిరుపతి, ఎల్ ఎచ్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి దిరావత్ రాజేష్ నాయక్, వి. రమేష్, కె. శ్రీశైలం, డి బి ఆర్ సి కో ఆర్డినేటర్ రఘుపతి, ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## రోడ్డు వెడల్పు 120 ఫీట్లలోపు పరిమితం చేయాలి : జెఏసి ప్రతినిధులు

**కంటోన్మెంట్, జనవరి 24 ప్రభాతవార్త:** రాజీవ్ రహదారి ప్రధాన రోడ్డు మార్గంలో సికింద్రాబాద్ జెబిఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు నిర్మించ తలపెట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో నష్టపోయే బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, 200 అడుగుల నుంచి వంద అడుగుల వరకు తగ్గించాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ హైదరాబాద్ జిల్లా ఆర్.డి.ఓ.వెంకటచారికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం కంటోన్మెంట్ 7వ వార్డు టీచర్స్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై రోడ్డు వెడల్పులో నష్టపోతున్న వారికి అభిప్రాయాల కోసం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ప్రాపర్టీ ఓనర్స్ ఎదురొ కంటున్నా వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో రోడ్డు వెడల్పులో 100 నుంచి 120 ఫీట్లకు తగ్గించాలని ప్రాపర్టీ ఓనర్లు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, భూ సేకరణ అధికారి అపర్ణ, తిరుమలగిరి తహశీల్దార్ అశోక్ కుమార్, రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్ల జేఏసి ఛైర్మన్ తేలుకుంట సతీష్ గుప్త, జేఏసి ప్రతినిధులు అమర్ నాథ్, సుబ్బారావ్, వెంకన్న, శ్రీనివాస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం గ్రామ సభలో ఆర్.డి.ఓ.వెంకటచారికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసి ఛైర్మన్ తేలుకుంట సతీష్ గుప్త తదితరులు

## 'భామాకలాపం" నృత్య ప్రదర్శన


"భామాకలాపం" నృత్య ప్రదర్శన పోస్టర్ ను ఆవిష్కరించిన దృశ్యం.

**చిక్కడపల్లి జనవరి 24 (ప్రభాతవార్త) :** సురస అకాడమీ( బెంగుళూరు ) నవ్య నాటక సమితి, సంయుక్తాధ్వర్యంలో జనవరి 30న రవీంద్ర భారతిలో కూచిపూడి నృత్యానికి మూల పురుషుడు సిద్ధేంద్ర యోగి రచించిన "భామాకలాపం" నృత్య ప్రదర్శనను నిర్వహించనున్నారని నిర్వాహక సంస్థల ప్రతినిధులు సమీర్ కులకర్ణి , నిష్టల సుధామాలలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం నాడు చిక్కడపల్లి సమితి కార్యాలయంలో ప్రముఖ నృత్య గురువు, కేంద్ర సంగీత నాటక అకాడమీ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత వేదాంతంసత్య నరసింహ శాస్త్రి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన నృత్య కళాకారిణులు మధుమతి కులకర్ణి, విదుషి రాజశ్రీ హుల్ల, నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ కుమార్ లతో కలిసి ఆవిష్కరించారు. ఆనాటి కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ముఖ్యఅతిథిగా, భాషాసంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రముఖ నృత్యగురువులు కేంద్రసంగీత నాటక అకాడమీ గ్రహీత మరియు సభ్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, ఆర్.ప్రసన్నరాణిలను సత్కరించనున్నారు.

## తిరుపతి వేంకట కవులు సాహిత్య లోకంలో గురుతుల్యులు

**చిక్కడపల్లి, జనవరి 24 ప్రభాతవార్త:** అవధాన విద్యను తెలుగు నాట దశదిశలా వ్యాప్తి చేసి తెలుగు భాషా సంపదను పెంపొందించన తిరుపతి వేంకట కవులు సాహిత్య లోకం లో గురుతుల్యులు అని సిబిఐ న్యాయ స్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీ శర్మ అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గానసభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా తిరుపతి వేంకట కవులు యాదిలో పేరిట సమావేశం అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ నాగ మారుతీ శర్మ పాల్గొని మాట్లాడుతూ తిరుపతి వేంకట కవులు గా ప్రసిద్ధి పొందిన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, దివాకర్ల తిరుపతి శాస్త్రిలు పలు సంస్కృత తెలుగు భాషా కావ్యాలు రచించారని వివరించారు. వారు రచించిన పాండవో ధ్యోగ విజయాలు పౌరాణిక పద్య నాటకం జగత్ ప్రసిద్ధం అని, ఇందులోని కృష్ణరాయబారం పద్యాలు, గ్రామీణ ప్రాంతాల సామాన్య ప్రజలు సైతం పాడుకొనేలా వ్యాప్తి చెందాయన్నారు. నేటికీ ప్రజలు ఆ నాటకాన్ని ఆదరిస్తున్నారు అని చెప్పారు గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సీనియర్ జర్నలిస్ట్ జయ సూర్య గాయకులు జయ కృష్ణ జైహింద్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్లార్ఐటి కళాశాలలో ర్యాగింగ్ కలకలం -దుండిగల్ పిఎస్‌లో కేసు నమోదు..

**దుండిగల్, జనవరి 24 ప్రభాతవార్త:**

నగరశివారు దుండిగల్ పురపాలిక పరిధిలోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎమ్మెల్లార్ఐటి) కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేపింది. జూనియర్, సీనియర్‌ల మధ్య జరిగిన ర్యాగింగ్ వ్యవహారం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. వివరాల్లోకి వెళితే... వరంగల్ జిల్లాకు చెందిన ప్రణవ్ అనే విద్యార్థి కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విధ్యనభ్యసిస్తున్నాడు. ఈనెల 23న సాయంత్రం కళాశాలలోని క్యాంటీన్ వద్ద ఉన్న ప్రణవ్‌ను అదే కళాశాలలో ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన శ్యామ్ అనే విద్యార్థి కలిశాడు. ప్రణవ్‌కు రూబిక్‌క్యూబ్‌ను సరిగా సెట్ చేయాలంటూ ర్యాగింగ్‌కు పాల్పడ్డాడు. దీంతో మనస్థాపానికి గురైన ప్రణవ్ కాసేపటి తరువాత తరగతి గదిలో ఉన్న శ్యామ్‌ను బయటికి పిలిచి దాడి చేయడంతో స్వల్ప గాయాలైయ్యాయి. విషయం తెలుసుకున్న సీనియర్లు కళాశాల నుండి బయటకు వచ్చిన ప్రణవ్‌పై మూకుమ్మడిగా దాడి చేయడంతో గాయాలపాలైయ్యాడు. దీంతో ప్రణవ్ దుండిగల్ పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కళాశాలలోని సిసి ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సతీష్ పేర్కొన్నారు. ర్యాగింగ్ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కళాశాల యాజమాన్యం యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ టీమ్‌ను విచారణకు ఆదేశించినట్లు తెలుస్తుంది.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
టెండర్ ప్రకటన

క్ర.సం.1 నిట్ నం.20/SE(M)/CRZ/GHMC/2024-25, తేది: 23.01.2025. పని పేరు: సివిల్ పని యొక్క 02 నం.లు. అంచనా మొత్తం (రూ.లక్షల్లో) 219.00 మొత్తం: పని యొక్క 02 నం.లు-రూ.219.00. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 25.01.2025న సా.05.00 గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 01.02.2025న మ.3.30 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ వై మహేశ్వరరెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్, GHMC, పూల్‌బాగ్, బాబానగర్, ఫోన్: 7993354273. తదుపరి వివరాలు https://tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (M), చార్మినార్ జోన్, GHMC
DIPR.No.9610-PP/CL/Advt/1/2024-25, తేది: 24.01.2025

వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, NOOR JAHAN W/o. MOHAMMED ABDUL HAAMED R/o H.No.2-3-361, B-Block, Nallagutta, Sec-bad, T.S. Have Changed my Name from NOOR JAHAN HAAMED to NOOR JAHAN, for the Purpose of All Records.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

PUBLIC NOTICE

General Public are hereby informed that my clients **Sri. T.P.S. Talwar, and Sri Daman Talwar,** R/o 81 Saket Mitla, Kapra, Hyderabad entered into an Agreement of Sale to purchase All that the Western Portion of the Office Premises bearing Municipal No. 5-4-76/3 PTIN No.: 1180502866 on First Floor with Built up area of 368.3 Sq feet out of 595 Sq feet together with Undivided Share of Land admeasuring 18.4 Sq yards out of 30 Sq yards in 240 Sq yards in Premises bearing No. 5-4-75 and 5-4-76 situated at M.G. Road, Ranigunj, Secunderabad from **1) Smt. Janaki Mahurkar @ ArcotAruna** W/o Late Raghottam Mahurkar (D/o Late A.V.Ramchander Rao) R/o H.No. 1-88/2/A/4 Taranagar, Serilingampally, Hyderabad and **2) Smt. Arcot Jaya Sree** W/o Late Arcot Sudhakar (Daughter-in-law Late A.V. Ramchander Rao) R/o H.No.5-4-76/1 M.G. Road, Secunderabad

If any person or persons have any manner of right and interest over the above mentioned Property and objection for the Sale they may approach me with the relevant documents pertaining to the claim within Seven days failing which my Client shall proceed with the transaction construing that there are No Objections and Objections if any received thereafter will be deemed to have been waived and the transaction shall be completed.

**S.V. VIDYA SAGAR**
**Advocate**
98, Doveton Road, Bolarum,
Secunderabad-500010.
**Mobile No: 9849613192.**

PUBLIC NOTICE

**TO WHOMSOEVER IT MAY CONCERN,**

Please take notice that my client **Sri. AltafHussain, S/o. Sri. Madhar Sahib,** R/o. H. No. 2-41/H/203, Beside Petrol Bunk, Chaitanyapuri, Saroornagar, Hyderabadhas lost his original title document i.e.,Sale Deed dated 22.07.1992bearing document No. 8410/1992 pertaining to property covered by Plot bearing Nos. 455, admeasuring 400 Sq.Yards equivalent to 334.34 Sq.Meters in Survey No.57, situated at Turkayamzal Village, Ranga Reddy District. The finder of the said document may kindly return the same to my client. The public is hereby informed that any pledge or mortgage based on the above said documents by unauthorized persons does not bind my client or the above mentioned property.

**A. SANJAY**
**Advocate,**
H. No. 2-4-215, Road No. 9A,
Snehapuri Colony, Nagole,
Hyderabad - 500 035.
**Cell :: 99660 88568**

## వాహనదారులు తరచుగా కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలి : ఆర్టీఓ లెక్కల కిష్టయ్య



కంటి వైద్య శిబిరంలో ప్రసంగిస్తున్న ఆర్టీఓ లెక్కల కృష్ణయ్య, చిత్రంలో ఎంవిఐ లు రమేష్ బాబు తదితరులు

**మలక్ పేట, జనవరి 24, ప్రభాతవార్త:** వాహనదారులు తరచుగా కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని మలక్ పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీఓ లెక్కల కిష్టయ్య ఆధ్వర్యంలో ముసారాంబాగ్ లోని మలక్ పేట ఆర్టిఏ కార్యాలయంలో డ్రైవర్లకు, దరఖాస్తుదారులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేంద్రియనాం నయనం ప్రధానమని, వాహనదారులు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. వాహనదారులు రోడ్డు నియమ, నిబంధనలను, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని కోరారు. రోడ్డు నియమ, నిబంధన గురించి వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలను నిర్వహిస్తున్నమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టులు ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలని ఇవ్వవద్దని, సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ లు నరేంద్ర పాల్ సింగ్, రమేష్ బాబు, రాధిక, బలరాం, ఏఎంవిఐ లు రజని, మధుసూదన్ రెడ్డి, అష్రఫ్ ఖాన్, జాన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు ప్రవీణ్ కుమార్, అంజుమ్, మధుకర్, సిబ్బంది గౌస్, అరుణ్, వినయ్, విజయలక్ష్మి, మహేశ్వరి, శ్రీకాంత్ ,విజయ, శైలజ, రజిని తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా : మైనంపల్లి



**మల్కాజిగిరి జనవరి24,ప్రభాతవార్త :** మల్కాజ్ గిరి ఆంజనేయ స్వామి దేవయలం నూతన నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరిశీలించి అనంతరం గడప ఏర్పాటు పనులకు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు

## అవయవదానం చేసిన యువకుడు

**మల్కాజిగిరి జనవరి24,ప్రభాతవార్త :** మరణంలోనూ అవయవదానం చేసి యువకుడి ఆదర్శం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు అవయవ దానం చేసి ఆదర్శంగా నిలిచాడు మల్కాజిగిరి కి చెందిన మనోజ్ కుమారుడు వంశీ (24) అమెజాన్ ఉద్యోగి. ఈనెల 23వ తేదీ స్నేహితుతో కలిసి కొమరవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్లి బైక్ మీద తిరిగి వస్తుండగా కొమరవెల్లి మండలం ఐనాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని స్నేహితుడు మృతి చెందగా తీవ్రంగా గాయపడిన వంశీని మొదట సిద్దిపేట ఆసుపత్రి తర్వాత గాంధీ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు అతని నేత్రాలు కిడ్నీలు దానం చేశారు

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



డ్రైవర్లను సన్మానిస్తున్న డిపో మేనేజర్ సమత తదితరులు

**మలక్ పేట ,జనవరి 24, ప్రభాతవార్త:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా దిల్ షుక్ నగర్ డిపోలో డిపో మేనేజర్ సమత ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు మలక్ పేట్, ఎల్బీనగర్ ట్రాఫిక్ ఎస్ఐ రాము, వినోద్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం డిపోలో 35 సంవత్సరాలుగా ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా విధులు నిర్వహించిన నలుగురు డ్రైవర్లు సూర్య కుమార్, ఇబ్రహీం ఖాన్, అరుణ్ కుమార్, రాములు తదితరులను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల అవగాహన ర్యాలీ



ఉప్పల్‌లో ట్రాఫిక్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు దృశ్యం.

**ఉప్పల్, జనవరి 24 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు వాలంటీర్లు ఉప్పల్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.కె.విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.రవికుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ జె.విశ్వనాద్‌కుమార్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి, ఎస్ఐ నరేష్, రమేష్, నాగభూషణం, ఎఎస్ఐ భారతి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపించాలని సూచించారు. సుమారు 30 మంది వాలంటీర్లు జిల్లా నెహ్రూ యువ కేంద్రం సంఘటన్ సౌజన్యంతో టీషర్టు, క్యాప్స్, డైరీలు అందజేశారు. జిల్లా యువజన అధికారి ఐజయ్య వాలంటీర్లకు సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కమిటి డా.ఎన్.రాజశ్రీ, సత్యనారాయణ, డా.జి.తిరుపతయ్య, డా.వి.శ్రీనివాసరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులుగా రవీంద్రనాథ్ యాదవ్



చింతల రవీంద్రనాథ్ యాదవ్ ని సన్మానిస్తున్న టివి జేపి రాష్ట్ర కన్వీనర్ మేకల కృష్ణ, కో కన్వీనర్ శెట్టి హరికృష్ణ యాదవ్ తదితరులు

**మలక్ పేట ,జనవరి 24, ప్రభాతవార్త:** అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా మలక్ పేటకు చెందిన చింతల రవీంద్రనాథ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి బల్ బి ర్ సింగ్ యాదవ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. అఖిలభారత యాదవ్ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన చింతల రవీంద్రనాథ్ యాదవ్ ని మలక్ పేట్ లోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో టీవీ జెఏ రాష్ట్ర కన్వీనర్ మేకల కృష్ణ, కో కన్వీనర్ శెట్టి హరికృష్ణ యాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు దోటి నాగరాజు, జక్కుల రాజా శేఖర్ యాదవులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చింతల రవీంద్ర నాథ్ యాదవ్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి యాదవులు కీలకపాత్ర పోషించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడిన యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించడంతోపాటు, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో, స్థానిక సంస్థల సీట్ల కేటాయింపులో యాదవులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని యాదవుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. జాతీయ నాయకత్వం తనపై నమ్మకం ఉంచి గురుతర రాష్ట్ర బాధ్యతలు అప్పగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన తండ్రి కీర్తిశేషులు చింతల లక్ష్మణ్ యాదవ్ అఖిలభారత యాదవ మహాసభకు చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుంటూ అందరికీ అందుబాటులో ఉండి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సదర్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# అభివృద్ధి దిశగా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ



**తుర్కయంజాల్ జనవరి24, ప్రభాతవార్త :** తుర్కయాంజాల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో పరిణయ కన్వెన్షన్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశం మరియు వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగా రెడ్డి , ,తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరయ్యారు. మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి , వైస్‌ఛైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి ,టిఎస్ఎటి ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి , కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కౌన్సిల్ సాధారణ సమావేశంలో మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమాలోచనలు జరిపి, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం, కౌన్సిలర్ల పదవీ కాలం ముగియనుండడంతో వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి, కౌన్సిలర్లను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగా రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనంతగా తుర్కయాం జాల్ మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 130 కోట్ల మున్సిపాలిటీ నిధులు మాత్రమే ఖర్చు చేయగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 250 కోట్ల రూపాయల పైగా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలుస్తూ, మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రజల అవసరాలను తీర్చడంలో ముందంజలో ఉంటుందని తెలిపారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించిన వారికి కృతజ్ఞతలు : మేయర్ పారిజాత



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పారిజాత: సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, జనవరి 24 ప్రభాతవార్త:** ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పించడానికి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంతగానో కృషి చేస్తున్నదని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మేయర్ అధ్యక్షతన కమీషనర్ సరస్వతి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ 2020-2025కు సంబంధించిన పాలకవర్గం చిట్ట చివరి సాధారణ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గడచిన ఐదేళ్ళ కాలంలో ఎంతో అభివృద్ధి సాధించడం జరిగిందని వెల్లడించారు. ఇక్కడ అభివృద్ధి పనుల కోసం రూ.89 కోట్ల నిధులను విడుదల చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నాదర్‌గుల్ మీదుగా ఆదిభట్ల ఔటర్ రింగ్ రోడ్డుకు వాహనాల రద్దీ పెరగడం దానికి తోడు నాదర్‌గుల్‌లో కాలనీలు పెరగడం వల్ల రోడ్ల అభివృద్ధికి రూ.1.50 కోట్లు కేటాయిస్తూ తీర్మాణం చేశామనీ అదే విధంగా బాలాపూర్ చెరువులో మురుగు నీరు కలవకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి రూ.2 కోట్లను కేటాయించడం జరిగిందని వివరించారు. 2020 నుండి బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఎంతో ప్రగతి సాధించిందని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ అభివృద్ధికి సహక రించిన అన్ని పార్టీల కార్పొరేటర్లకు, నాయకులతో పాటు ప్రజలకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్,బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్లు సూర్ణగంటి అర్జున్, తోట శ్రీధర్‌రెడ్డి, వంగే టి ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా ఈ చివరి కౌన్సిల్ సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు గాను రూ.63 కోట్లకు సంబంధించిన తీర్మాణాలను కౌన్సిల్ ఆమోదించింది.

## యాదవ సభ అధ్యక్షుడు రవీంద్రనాద్‌కు సత్కారం



యాదవ మహాసభ అధ్యక్షునిగా ఎన్నికైన రవీంద్రనాద్‌ను సత్కరిస్తున్న వల్లపు జగన్‌యాదవ్ తదితరులు

**ఉప్పల్, జనవరి 24 ప్రభాతవార్త :** అఖిల భారత యాదవ మహాసభ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన చింతల రవీంద్రనాద్ యాదవ్‌ను శుక్రవారం రామంతాపూర్ యాదవ సంఘం సీనియర్ నేత వల్లపు జగన్ యాదవ్ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వల్లపు జగన్‌యాదవ్ మాట్లాడుతూ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మహాసభకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారని తెలిపారు. యాదవుల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు పాల్గొన్నారు.

## టిఎస్‌యుటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడిపల్లి ప్రధానోపాధ్యాయురాలు శిరీష తదితరులు

**సరూర్‌నగర్, జనవరి 24 ప్రభాతవార్త:** బాలాపూర్ మండల టిఎస్‌యుటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష, టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్, బాలాపూర్ మండల అధ్యక్షుడు ఇ.జోయెల్, ప్రధాన కార్యదర్శి మాల్య నాయక్‌లు పలువురితో కలిసి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ నాయకులు ఎర్ర శ్రీరాం, ప్రకాశ్, విజయ్‌కుమార్, స్వామి, ఎల్.రాజు, జగన్, ఆంజనేయులు పుష్పలత, జ్యోతి ఫిలోమినా, జంగయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

**ఎల్.బి.నగర్, జనవరి 24 ప్రభాతవార్త:** కొత్తపేటలోని సౌభాగ్యపురం కాలనీలో నిర్వహించిన వైద్య శిబిరానికి అపూర్వస్పందన లభించింది. సౌభాగ్యపురం కాలనీ పార్కులో వాకర్స్ కోసం నాగోల్ సుప్రజా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 40 మందికి పైగా వాకర్లకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, మార్కెట్ డైరెక్టర్ బండి మధు, సుప్రజా ఆసుపత్రి డిజిఎం ఏవి.రావు, క్యాంపు కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, అనూష, దివ్య పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తాం : కార్పొరేటర్



**వనస్థలిపురం. జనవరి. 24.ప్రభాతవార్త.** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శాతవాహన నగర్ కాలనీలోని సంక్షేమ సంఘం భవనము మొదటి అంతస్తులో 23.8 లక్షల నిధులతో మంజూరైన మహిళా భవనము త్వరలో ప్రారంభం కానున్న నైపద్యంలో కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు బి.యన్ రెడ్డి నగర్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సంక్షేమ సంఘం భవనంను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ మహిళా సంక్షేమ సంఘం భవనము మహిళల కోసం మరియు వారి కార్యక్రమాలు చేసుకోవటానికి వీలుగా ఈ భవనము నిర్మిస్తున్నట్లు తెలిపారు మరియు త్వరలోనే కాలనీలోని ప్రతి అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నందిరాజు లక్ష్మీ నారాయణ,కార్యదర్శి ఎస్ నాగేశ్వర రావు, కోశాధికారి చిరంజీవి సభ్యులు దత్తాత్రేయ శర్మ, మురళీ కృష్ణ, అక్బర్ ,వెంకన్న, గురునాథ రావు, సుదర్శన్ రావు, తిరుమల రావు,రామకిషన్ రావు,మహిళా సభ్యులు, నందిరాజు పద్మావతి, శారద,లక్ష్మీ, మాణిక్యాంబ,సువర్ణ మరియు డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేవైఎం సెక్రెటరీ పవన్ రెడ్డి, నాయకులు విజయ,ఎస్సీ మోర్చ సెక్రెటరీ దుర్గాప్రసాద్, నాయకులు వికాస్, ఠాగూర్, యశ్వంత్, సాయి చరణ్ పాల్గొన్నారు.

## కన్నతల్లి పై కొడుకు కత్తితో దాడి

**-చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో తల్లి**

**-పోలీసుల అదుపులో నిందితుడు....**

**నేరేడ్‌మెట్, జనవరి 24 ప్రభాతవార్త :** నవ మాసాలు మోసి కనీ పెంచిన తల్లిని పాశవీకంగా కత్తితో పొడిచిన కసాయి కొడుకు ను పోలీస్ లు అదుపులో తీసుకున్న సంఘటన నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వినాయక నగర్ మజీద్ లైన్ లో నివసించే బైకన్ మల్లమ్మ వయసు (64) వృత్తి హౌస్ వైఫ్ పై అతని పెద్ద కొడుకు సురేష్( 44) శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల 30 కి విచక్షణ కోల్పోయి తల్లి మల్లమ్మ ముఖంపై, వీపు వెనక భాగంలో కత్తితో దాడి చేశాడు. విషయం తెలుసుకున్న చిన్న కుమారుడు సుధాకర్ వెంటనే ఈసీఐఎల్ లోని శ్రీకర ఆసుపత్రికి తరలించాడు. చిన్న కోడలు శైలజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోండి దర్యాప్తు చేస్తున్నారు. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం: కార్పొరేటర్



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 24 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. క్యూబా మజీదు వద్ద, రోజ్ ల్యాండ్ కాలనీలో నూతన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రోడ్లు, త్రాగునీరు, డ్రైనేజీ వంటి మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, కాలనీవాసులు ముజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వసౌభాగ్య దేవి త్రయ గీతా జ్ఞాన యజ్ఞం ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**సైదాబాద్, జనవరి 24 ప్రభాతవార్త :** లోక కళ్యాణార్థం శాంతి భారతి పురస్కార గ్రహీత, దుర్గాదేవి ఉపాసకులు మురుకుంట్ల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్‌లోని శ్రీలక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం 1935 వ శ్రీ సర్వసౌభాగ్య దేవి త్రయ గీతా జ్ఞాన యజ్ఞం ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 24, 25, 26వ తేదీలలో మూడు రోజుల పాటు యజ్ఞాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం యాగశాల ప్రవేశం, శ్రీ ఓంకార ప్రణవ పతాకావిష్కరణ, శ్రీ మహాగణాధిపతి పూజలతో యజ్ఞ కార్యక్రమాలను ప్రారంభించారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ యజ్ఞ ప్రారంభోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. శ్రీ సర్వసౌభాగ్య దేవి త్రయ గీతా జ్ఞాన యజ్ఞం నిర్వహించడం ఎంతో పుణ్యఫలమని, దేశ, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ యజ్ఞం నిర్వహించడం అభినందనీయమన్నారు. మురుకుంట్ల అరవిందు శర్మ, మురుకుంట్ల మురళీకృష్ణ శర్మల సమన్వయంలో జరుగుతున్న కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు ఊరె లక్ష్మణ్ గుప్తా, శ్రీ లక్ష్మి కన్వెన్షన్ యజమానులు సూరిశెట్టి సింహయ్య, సూరిశెట్టి శ్రీనివాస్ గుప్తా, సూరిశెట్టి సురేష్ గుప్తా, సూరి శెట్టి శశిధర్ గుప్తా, జూలూరు శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

## పద్మారావుగౌడ్‌కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శ



మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను పరామర్శిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 24 ప్రభాతవార్త :** ఉత్తరాఖాండ్ పర్యటనకు వెళ్లి అస్వస్థతకు గురైన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని ఆయన నివాసంలో పద్మారావుగౌడ్‌ను కలిసి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఉత్తరాఖాండ్ పర్యటనలో ఉండగా పద్మారావుగౌడ్‌కు గుండెకు శస్త్ర చికిత్స తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఆయనను కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శించారు. పార్టీ కోసం పద్మారావుగౌడ్ ఎంతో సేవ చేశారని, ఆయన ఆరోగ్యంగా ఉండాలని అకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికిన ఎంపిఆర్



సిఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జీ పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, జనవరి 24 ప్రభాతవార్త :** దావోస్ పర్యటన ముగించుకుని నగరానికి చేరుకున్న సిఎం రేవంత్‌రెడ్డికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు ఎయిర్‌పోర్టుకు వెళ్లి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దావోస్ పర్యటనలో సిఎం రేవంత్‌రెడ్డి లక్షా 78వేల కోట్ల పెట్టుబడులు సాధించారని పేర్కొన్నారు. సిఎం పర్యటన విజయవంతం అయ్యిందని, దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. దావోస్ పర్యటనతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## రామంతాపూర్ బిజెపి డివిజన్ అధ్యక్షునిగా సంతోష్‌గుప్త

**ఉప్పల్, జనవరి 24 ప్రభాతవార్త :** రామంతాపూర్ బిజెపి డివిజన్ అధ్యక్షునిగా వంగాల సంతోష్‌గుప్త నియమితులైయ్యారు. ఈ మేరకు బిజెపి ఎన్నికల అధికారి టి.ఆచారీ ఆదేశాలు జారీ చేశారు. రామంతాపూర్‌లో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేసిన సంతోష్‌గుప్తను పార్టీ అధ్యక్షునిగా ఎంపిక చేయడంపై పలువురు నేతలు అభినందనలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగు గుర్తింపు ఉంటుందని సంతోష్ గుప్త పేర్కొన్నారు. రామంతాపూర్‌లో బిజెపిని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాగా రామంతాపూర్ బిజెపి ప్రధాన కార్యదర్శిగా టి.బాలకృష్ణగౌడ్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విడత పార్టీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి పదవుల ఎంపికలో యువతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పార్టీ నేతలు తెలిపారు.

## డివిజన్ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ వినతి



డిసి సుజాత తో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 24 ప్రభాతవార్త:** డివిజన్లో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కాలనీవాసులతో కలిసి సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాతను కలిసి పలు సమస్యలను ఆమెకు వివరించారు. కాలనీలలో రోడ్లు, పార్కులు, జిమ్‌లను ఏర్పాటు చేసే అంశాల గురించి డీసీ దృష్టికి తీసుకువెళ్లారు. డివిజన్లో జరిగే అభివృద్ధి పనుల విషయంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అభివృద్ధికి ఆటంకం కలగకుండా సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రోడ్డుపై వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టిఏ అధికారులు

**ఎల్.బి.నగర్, జనవరి 24 ప్రభాతవార్త:** రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లేటప్పుడు విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాలని నాగోల్ ఇన్చార్జి ఆర్టీవో కే.అమర్‌నాథ్ సూచించారు. నాగోల్ నాగార్జున పాఠశాలలో శుక్రవారం జాతీయ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రతకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు భద్రత పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే దానికి జాగ్రత్తలు పాటించడమే ముఖ్యమన్నారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతకు సంబంధించి అవగాహన పెంపొందించుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు. ఎంవిఐలు శ్రీధర్, అభిలాష్, వేణు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయబద్ధంగా పండుగలు నిర్వహించాలి:ఎమ్మెల్సీ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

**ఎల్.బి.నగర్, జనవరి 24 ప్రభాతవార్త:** సాంప్రదాయబద్ధంగా పండుగలు జరుపుకోవాలని జై గణేష్ భక్తి సమితి రాష్ట్ర సలహాదారులు, ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తా పేర్కొన్నారు. జై గణేష్ భక్తి సమాజం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్ను శుక్రవారం ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సాంప్రదాయ పండుగలలో ప్రపంచవ్యాప్తంగ జరుపుకొనే ముఖ్యమైన పండుగ వినాయకచవితి అని 11రోజులు జరుపుకునే పండుగకు సాంప్రదాయ పద్ధతులలో పండుగ జరుపుకోవాలని క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. కుంటాలను, చెరువులను, జీవనదులను అందులో నివసించే జీవాలకు హాని కలగకుండా నిమజ్జనం చేయడం కోసం ప్రచారం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ బి.విజ యరంగ, తెలంగాణ ప్రైవేట్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రుషీ, సంస్థ ఫౌండర్ ఛైర్మన్ జైన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## తార్నాక సరోజినీనాయుడు వనితా ఫార్మసీ కాలేజ్‌లో అట్టహాసంగా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్



బెలున్లను గాలిలోకి వదిలి ప్రోటీలను ప్రారంభిస్తున్న ఉపాధ్యక్షులు నిరంజన్ తధితరులు

**తార్నాక, జనవరి 24 ప్రభాతవార్త:** ఎగ్జిబీషన్ సొసైటీ ఆధ్వర్యంలో తార్నాకలోని సరోజినీనాయుడు వనితా ఫార్మసీ మహిళా విద్యాలయ కాలేజ్‌లో శుక్రవారం అట్టహాసంగా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ అట్టహాసంగా క్రీడా పోటీలు నిర్వహించారు. 10 కళాశాల నుంచి సుమారు 330 మంది విద్యార్థినిలు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభకనబరిచారు. ఈ క్రీడా పోటీలను ఎగ్జిబీషన్ సొసైటీ ఉపాధ్యక్షులు కసోజి నిరంజన్ ప్రారంభించగా సాయంత్రం గెలుపొందిన క్రీడాకారులకు సరోజిని నాయుడు వనితా ఫార్మసీ మహిళా విద్యాలయ గౌరవ ఛైర్మన్ డా. బి.ప్రభాశంకర్ బహుమతులను అందజేశారు. సందర్భంగా కసోజి నిరంజన్ మాట్లాడుతూ విద్యార్థినులకు తమ కళాశాలల్లో విద్యార్థినులకు చదువుతో పాటు క్రమశిక్షణ, క్రీడల్లో రానించేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవాలిబాల్, ఖోఖో, కబడ్డి, టెన్నికాయిట్, క్యారమ్స్, టేబుల్ టెన్నీస్, షాట్‌పుట్, లాంగ్ జంప్ వంటి పోటీలు నిర్వహించారు. చఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ బి.హన్మంత్ రావు, కన్వీనర్ మన్‌జిత్ రెడ్డి, సలహాదారులు అనిల్ స్వరూప్ విశ్ర, జాయింట్ కన్వీనర్ బి. సుధీర్ చక్రవర్తి,బి.మల్లికార్జున్ రెడ్డి, కోషాదికారి సంధ్యదీపాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన యెల్మేటి అమరేందర్‌రెడ్డి



మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 24 ప్రభాతవార్త:** విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి తదితరులు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్ళడం జరిగింది. అయితే శుక్రవారం తిరిగి వచ్చిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను గాంధీభవన్‌లో కలిసిన అమరేందర్‌రెడ్డి పార్టీ కండువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన టిపిసిసి అధ్యక్షునితో పార్టీ విషయాలను చర్చించారు.